తులనాత్మకం
సమాలోచనం

**Comparative**
**Literary Criticism**

# సృజన చేతన
# రామాయణ కల్పవృక్షం

**మొదటి భాగం**

**మాదిరాజు రంగారావు**

2009
సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

Comparative
Literary Criticism
**SRUJANA CHETANA**
Ramayana Kalpa Vriksham
Telugu
by
**Prof. Madiraju Ranga Rao**

© Dr. M. Santhosh Kumar

Y. P. 2009

Price Rs. **Ten Only**

Published by
Rasadhuni Sahithi Parishath
Shantinagar, Hyderabad - 500 028.

For Copies
Navodaya Book House
Kachiguda, Hyderabad - 27.

Printed at
Sai Ram Printers,
Lakdikapul,
Hyderabad - 4.

Presented
to
my second daughter
***Dr. M. CHARITHA***
Research Scientist
Sandiego
California U.S.A
with
affection
on her Birth Day

## సూచిక

1. సంవేదన – రచనాశిల్పం........05
2. సంతాప శిఖరం..................12
3. దర్శన రూపం.....................17
4. తమో నిలయం...................27
5. ఆత్మ శిఖ..........................30
6. వర్ణనా విభవం....................33
7. వర్ణనా దీప్తి.......................37
8. అనుభూతి శిఖరం...............42
9. ఆధ్యాత్మిక తేజం..................45
10. హంస దర్శనం................. 54

# 1. సంవేదనా హృదయం రచనా శిల్పం

వాల్మీకి రామాయణం అరణ్య కాండలో జన స్థానంలో రావణుడు సీతను అపహరించి రథంపై నిలిపి పై కెగిరిన సన్నివేశంలో ఆమె పొందిన సంవేదనా హృదయం ఆభాషణంలో స్పందిత మయింది. సంవేదనా శీలంతో కరుణోపేతమయిన భావ సముల్బణం కవితాకృతిని పొందింది. మానవేతరమయిన వాటితో అనుబంధం స్థాపితమయింది. వన దేవతామయ మయిన ప్రకృతి రూపాలతో మృగపక్ష్యాది ప్రాణులతో గిరితో నదితో ప్రవృత్తమయింది. ఇవి ఆమె ఆభాషణంతో మానవీకృతం కావడం ఇందులో విశేషం. తానుపొందిన దుర్దశలో సంతాపం భర్త పట్ల ప్రేమ ఆతని విక్రమం పట్ల అచంచల మయిన విశ్వాసమూ ప్రకటితమయినాయి.

రామాయణ కల్పవృక్షంలో మూలంలోని స్పందనా క్షేత్రం కవి కల్పనతో సువివృతమయింది. ప్రౌఢమయిన రచనా శిల్పాన్నీ పొందింది. సంస్కృత భాషా సమాస సౌందర్యంతో పాటు తెలుగు పలుకులోని శోభనూ కలిగింది. పద్యమూ వచనమూ కలిసిన రూపంతో తెలుగు కావ్య పరంపరా రూపాన్నీ భావింపజేస్తుంది. రావణుని రథం మింటి కెగసే వేళకు సీత మూర్ఛ నుండి తేరుకుంది. చూస్తే తాను రావణుని అధీనంలో ఉంది. రథ గమనంతో పర్ణశాలకు దూరమవుతూంది. రథం దక్షిణ దిశగా వెళుతూంది. వెను దిరిగి చూచింది.

తాను వీడి పోయే పర్ణశాలా పరిసరాలు మనస్సును ఆవహించాయి. రామ లక్ష్మణులూ మనసులో నిలిచారు. అక్కడ చుట్టూ చెట్లూ పక్షులూ హరిణాలూ తప్ప ఎవరూ లేరు. ఇవి ఆమెకు సుపరిచితాలే! తన దఃఖమయ స్థితిని గురించి చెప్పుకునేందుకు అక్కడ ఎవరూ లేరు. వినేందుకూ ఎవరూ లేరు. దండ కారణ్యంలో తనకు రాముడూ తరువాత లక్ష్మణుడూ ఆ తరువాత ప్రియమయిన స్థానం అదే! ఇది హార్దికమయిన అనుబంధం గానూ పరిణమించింది. తన అపహరణ వార్తను రామునికి తెలియ జేసేదెవరు? అతని కెలా తెలుస్తుంది? వారికి తెలిస్తేనే పరాక్రమ ప్రకటనంతో తన చెర వీడేదీ. బాధలో ఉన్న వాళ్ళకు తమను గురించి మరొకరికి వినిపించాలనే ఉంటుంది. ఇది స్వగతం కావచ్చు. మరొకరిని ఉద్దేశించింది కావచ్చు.

ఇక్కడ భావోద్వేగంలో పొంగే తరంగాల్లా మాటలు వెడలాయి. ఆమె దృష్టిలో వన దేవతలతో వన్య ప్రాణులతో గిరితో నదితో అనుబంధం మానవీయ స్థానాన్ని పొందింది. చెప్పరాని బాధా స్థితిలో ఇది సహజం కూడా. వాల్మీకి రచనలో దర్శన విశేష మిది. ఈ విధంగా రామాయణ కథలో ఈ సన్నివేశానికి ప్రాధాన్యం ఏర్పడుతూంది. కృతిలో ప్రధానమయిన పాత్రకూ వీటికీ మధ్య సూక్ష్మమైన అనుబంధాన్ని ఆవిష్కరించే మహర్షి దృష్టి అనితరమయిందీ.

వాల్మీకి ప్రభావంతో కాళిదాసు మేఘ సందేశంలోనూ అభిజ్ఞాన శాకుంతలం నాలుగో అంకంలోనూ గొప్ప సృజన రూపాల్ని గమనించవచ్చు. వాల్మీకి సృజన దర్శన మూలాలతో విశ్వనాథ కల్పవృక్షమూ అవతరించింది. వాల్మీకంలో తన అపహరణ వార్తను శీఘ్రంగా రామునికి తెలియజేయవలసిందిగా సీత మానవేతరాల్ని కోరింది. ఇవి ఆపని చేయగలవా? వాగింద్రియశక్తి కలిగినవా? శ్రవణేంద్రియ శక్తి కలిగినవా? తిరిగిచెప్పగలిగిన మనోరూపం ఉందా? అన్న ప్రశ్నలకు ఆస్కారం లేదు (1) ఆ సందర్భంలో పాత్ర బరువెక్కిన హృదయాన్ని మాటలతో తేలికపరచుకోవడం ఒకటీ, (2) అలవాటు వల్ల తమ చేష్టలతో స్వర రీతులతో కొన్ని ప్రాణులయితే మరీనూ ఎంతో కొంత సూచించగలవనే భావన మరొకటీ కారణాలుగా ఊహించవచ్చు. దుర్దశలో ఆప్తంగా తోచిన వాళ్ళు ఉపకరిస్తారనీ ఆలా తోచిన వాటితోనూ సహాయంకోరడం జరుగుతూ ఉంటుంది. ఆ స్థితి అట్లా చేయిస్తుంది. మేఘసందేశం కావ్యం దీనికి ఉదాహరణగా పేర్కోవచ్చు. ఈ స్థితిని వాల్మీకంలో ముఖ్యమయిన పాత్ర వర్తనలో లీనపరచి విశేషమైన అనుభూతిని ప్రసరింపజేయడం జరిగింది. ఇది కథా వస్తువును మరో కోణం నుండి పరిపుష్టం చేస్తూంది. మహాకృతిలో భావ రూపాల వరసతో పందొనిమిద (19) సర్గలో ఆరు శ్లోకాల్లో ప్రభావోపేతమయిన భాగంగా నిలిచింది. ఇది కేవలం వర్ణనా మాత్రంగానే కాక, కవిత్వ క్షేత్ర పరిధిని మానవీయమైన ఆలోచనతో పెంచుతూంది. మానుష స్పందనంతో అనుభూతి మయమవుతూంది.

## II

"ఆమంత్రయే జన స్థానే కర్ణికారాన్ సుపుష్పితాన్!
క్షిప్రం రామాయ శంస త్వం సీతాం హరతి రావణః"

జన స్థానంలో చక్కగా పుష్పించిన కర్ణికారాల్లారా! (గన్నేరు చెట్లు) రామునితో రావణుడు సీతను హరించుకొని పోతున్నాడని శీఘ్రంగా చెప్పండి. నిత్యమూ తాను చూచే పుష్పమయమైన తరువులతో హృదయ బంధం ఈ మాటల్ని పలికించింది. రథం నుండి వెనక్కి తిరిగి చూస్తే మొదట కన్పించిందీ పూల చెట్ల దృశ్యమే! అవి ఇపుడు మనుషుల స్థానాన్ని పొందిన వన దేవతలు! బహుశా అది కర్ణికార వృక్షాలు పూచే సమయం కావచ్చు. సౌకుమార్యం సుసంస్కారం సుమనోరూపంతో ఒప్పారే వ్యక్తిత్వం గల సీత హృదయానికి దగ్గరయినవి! వాటికి రాముడు పర్ణశాలకు తిరిగి రాగానే ఆ వార్త నందింపజేసే బాధ్యత అప్పగించబడింది. తమ చేష్టల తోనో ధ్వనుల తోనో సహజమైన స్వభావ గుణ క్రియా రీతులతోనో తాను కొనిపోబడిన దిశను సూచిస్తాయనే ఆశాభావం అంతర్లీనమై ఉంది. బాధలో ఉన్నవారు ఆగలేరు. హృదయం ఆగదు. మాట్లాడిస్తుంది. దాని ప్రభావం మరొక విధంగాను ఉందవచ్చు. అనుకోకుండా మరొకరికి వినిపించవచ్చు. వారి వల్ల ఎంతో కొంత సహాయం జరగవచ్చు. ఇది లోకసహజ మయిన వాస్తవం.

"మాల్యవంతం శిఖరిణమ్ వన్దే ప్రస్రవణం గిరిమ్!
క్షిప్రం రామాయ శంస! సీతాం హరతి రావణః"

ఉన్నతమయిన శిఖరాలతో శోభిల్లే పుష్పమయమయిన ప్రస్రవణ (పై నుండి పాయలుగా నీరు ప్రవహించే) గిరికి నమస్కరిస్తున్నాను. రామునికి శీఘ్రంగా ఈ వార్తను తెలియజేయవలసిందిగా కోరింది.

రామాయణ కల్పవృక్షంలో ప్రస్రవణగిరితో వినతి లుప్తమయింది. చెట్లూ అరణ్యంలో భాగమే, రథం కదలుతూంది. ఎత్తులో ఆ గిరి పై దృష్టిపడింది. ఇది సహజం కూడా. మరో విధంగా సీత కోసం వెదకుతూ వచ్చే రామలక్ష్మణులకు ఎత్తైన శిఖరాలతో ఉన్న గిరికి సులభంగా కనిపిస్తారు. అంతటా వెదకుతూ వారు ఆ వైపుకు రావచ్చు. అపుడా గిరి తన స్థితి గురించి తెలియజేసే అవకాశముందని సీత భావించడంలో అనౌచిత్యమేమీ లేదు. అమెకు కనిపించిన గిరి మాల్యవంతమయింది. శిలల మధ్య పూచిన పూల సమూహాలతో శోభిస్తూంది. సహృదయతనూ ఉపకార శీల హృదయాన్నీ భావింప జేస్తూంది. ఎత్తులో వెళ్ళే తనకు గిరి శిఖరంతో మాట్లాడం సులభం కూడా. మౌనముద్రలో ఉన్న గిరి ఏమి చేసినా చేయక పోయినా సంవేదనా తప్త హృదయానికి చేతనాచేతన పరిజ్ఞానం ఉండదనేది అందరికీ తెలిసిందే. ఇది కల్పనయే, అయినా పర్వతం పైనో ఆ సమీపంలోనో ఎవరయినా ఉండవచ్చు. వారికి వినిపించ వచ్చు. తన పని జరగ వచ్చు. ఇపుడు కాల్పనికం నుండి వాస్తవానికీ స్థితి

సముచితంగా పరివర్తితమవుతుంది. రాబోయే కథలో జటాయువు ప్రవేశాన్ని తలచుకుంటే గిరి ప్రసక్తిలో వాల్మీకి మహర్షి దర్శనమెంత ఔచితీ విలసితమయిందో స్పష్టమవుతుంది.

### III

కల్పవృక్షంలో ఈ సన్నివేశం పర్ణశాలాధి దైవత భావనతో ఆరంభమయింది 'అవునమ్మ! పర్ణశాలాధి దైవతమ !'' ఇంతకాలం "నివసన మ్మిచ్చి మన్నించినావు'' ఇపుడు " నీకు నాకును ఋణం'' తీరింది. ఆ క్షణంలో పూర్వపు స్మృతి మెదలింది. పర్ణశాలను "అలికి ముగ్గులు తీర్చే ఉత్సాహంలో'' తన "చేతి కంకణాల మధుర రవం'' వ్యాజంతో "సత్కారాన్ని పొందిన దేవతామూర్తి'' నుండి సెలవు తీసుకుంటుంది. ఇది ద్విపదలో వ్రాయబడింది. దీని తరువాత వచనంలో తన దురవస్థను ప్రత్యక్షంగా "ప్రతిబింబీకరించుకొన్న'' పర్ణశాలతో, తన కోసం వెదకే అన్న దమ్ములకు జరిగిన విషయం తెలియజేయ వలసిందిగా కోరుతుంది. చివరి దాకా బిడ్డ వలె చూడవలసిందిగానూ వేడుకుంటుంది. పర్ణశాలతో సీత సంబంధం తల్లికీ బిడ్డలకూ మధ్య ఉండే వాత్సల్య భావంతో తీర్చబడింద. ఇది విశ్వనాథ కల్పన. కుటుంబ పరమైందీ.

వాల్మీకంలో తరు దేవతల ప్రసక్తి స్పందన శీలంగా ఉంది.

"దైవతాని చ యాన్యస్మిన్ వనే వివిధ పాదపే!
నమస్కరోమ్యహం తేభ్యో భర్తుః శంసత మాం హృతామ్''

ఈ వనంలో ఉన్న వివిధ వృక్ష దేవతలకు నమస్కరిస్తున్నాను నన్ను అపహరించిన వార్తను భర్తకు తెలియజేయండి. రథం వేగంగా కదలే సందర్భంలో ఒక దృశ్యం తరువాత మరో దృశ్యం త్వరగా చోటుచేసుకోవడం సహజం. ఈ భావం కల్ప వృక్షంలో ప్రౌఢసుందర కవితామయంగా విస్తృతిని పొందింది. "పరిణత చ్ఛాయా ప్రపా శ్రేణికల''తో, "తరు కిసాలయ పత్ర పుష్ప తారుణ్యం''తో, "శీతలా కార సౌభాగ్యం''తో వన దేవతా రూపం వర్ణితమయింది. "దుఃఖార్ణవమగ్న''యైన సీతను "వరసగా తలలున్న పెద్దపిశాచి ఎత్తుకొని'' పోయే స్థితి సీత మాటల్లో దయనీయంగా చిత్రితమయింది. ఇందులో (1) పూర్వానుభవస్మృతి (2) రామచంద్రుని వియోగస్థితి (3) పరాకాష్ఠనందిన సీత దుఃఖ స్థితి ముప్పేటగా ఉన్నాయి. ఈ భావనకు సాగింపుగా



గోదావరీ "నదీ జల సేచన''తో పెంచిన "బాల తరు సంతాన'' రూపాల్నీ సంబోధిస్తుంది. తండ్రి వచ్చే వేళకు "తెల్లబోయి దిగాలు పడి చూడక'' "పది పుర్రెలొకచోట'' కనిపించే "శ్మశాన భూతుడెవడో'' బలాత్కారంగా అపహరించాడని చెప్పమనీ కోరుతుంది. ఇది వచనంలో చక్కగా అభివ్యక్తమయింది. తల్లిదండ్రులతో బిడ్డల అనుబంధాన్ని భావింపజేసే కుటుంబ వాతావరణంతో నిర్మితమయింది. ఈ దుస్థితిలో పిల్లలు జరిగింది చెప్పడంలో వెనుకంజ వేయక ధైర్యంగా తమ బాధ్యతను నిర్వహించవలసిన అవసరాన్ని సూచిస్తూంది.

వాల్మీకంలో వనదేవతా రూపాలూ కల్పవృక్షంలో పర్ణశాలా దైవతరూపం ప్రాముఖ్యం వహించాయి.

"యాని కాని చిదప్యత్ర సత్త్వాని నివసంత్యుత!
సర్వాణి శరణం యామి! మృగ పక్షి గణానపి''
"హ్రియమాణాం ప్రియాం భర్తుః ప్రాణేభ్యోపి గరీయసీమ్!
వివశాపహృతా సీతా రావణేనేతి శంసత''

ఈ వనంలో వసించే సమస్త మృగ పక్ష్యాది సమస్త ప్రాణుల్లారా! అందరినీ శరణు పొందుతున్నాను. అత్యంతమూ ప్రియ మయిందీ, ప్రాణాల కన్నా ఎక్కువ అయిందీ అయిన సీత, వివశయయిన స్థితిలో రావణుని చేత అపహృత అయిందని రామునికి చెప్పండి. సమస్త మానవేతర ప్రాణి సమూహాన్ని చేర్చి చెప్పడం మహర్షి రచనలో దర్శన రూపం విశ్వమయ మవుతూంది. ఇది వాల్మీకి రామాయణం అధ్యయనంలో కన్పించే మరో కోణం.

కల్పవృక్షంలో ఈ భాగం చతుష్పద, వితాళ చతుష్పద, కర్నాటక చతుష్పదల ఛందో వైవిధ్యంతో విలపిల్లింది. వరసగా శుక పికాల్నీ, హరిణ శాబకాల్నీ వనదేవతల్నీ సంబోధిస్తూ ఎవడో రాక్షసుడు సీతను అపహరించిన వార్తను అందజేయవలసిందిగా కోరుతుంది. హరిణ శాబకాల్ని ఉద్దేశించి 'భీతితో తండ్రిని చూచి పారిపోకండి!'' ఎవడో ఒక అసుర ఎప్పుడో మీతో తిరిగినా స్వామి మీరు బిడ్డలని తెలియకుండా ఉండడనీ అంటుంది. ఇది విశ్వనాథ కల్పన. ఇంతకు ముందు జరిగిన కథలో మారీచుడు లేడి రూపంలో అవతరించిన విషయం తలపుకు వస్తుంది. ఇది ఆమె మనసు పయి చెరగని ముద్ర వేసింది. ఆమె జీవిత గమనాన్ని మార్చివేసింది. మనస్తత్త్వ కోణంలో పరిశీలనార్హమయిన విషయం. వన దేవతల్ని ఉద్దేశించి "చనువుతోనో

సావాసంతోనో'' ఇపుడున్న స్థితిని చూచిన మీరు నా ప్రభువుకు ఎడబాటులో "ఆదరువుగా'' ఉండవలసినదిగానూ కోరుతుంది. ఇదీ విశ్వనాథ కల్పనయే. ఆపత్సమయంలో బిడ్డల్లో అవసరమయిన నిర్భీక గుణాన్నీ, తండ్రీ బిడ్డల మధురమయిన బంధాన్నీ, పతి పట్ల సతి శ్రద్ధనూ చిత్రిస్తూ కుటుంబ వాతావరణానికి ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది.

"విదిత్వా మాం మహాబాహుః అముత్రాపి మహాబలః!
ఆనేష్యతి పరాక్రమ్య వైవస్వత హృతా మపి''

మహాభుజశాలి రాముడు అపహరణాన్ని తెలుసుకొని యముడు తీసుకొని వెళ్ళినా పరలోకం నుండి అయినా పరాక్రమించి నన్ను తీసుకోని రాగలడు. తనపై భర్తకు తనకు భర్త పట్ల గల ప్రత్యయమూ ప్రకటితమైనాయి. వాల్మీకంలో (1) రామునిలో సీత పట్ల గాఢమయిన అనురాగంతో పాటు ఆమెకే విధమయిన బాధనూ సహించని దృఢ చిత్తం (2) భార్యా రక్షణ ధర్మాన్ని నిర్వర్తించే వీరమూ స్థాపితమయినాయి. ఈ భావ రూపం కల్పవృక్షంలో కనిపించదు. దీనికి బదులుగా రాఘవుని కోదండం నుండి వెలువడే శరాగ్నుల్నీ, దిశల్ని ఊగించే పరాక్రమాన్నీ, లోకభయం కరమయి తేజాన్నీ మూర్తి కట్టించే వీర వ్యక్తిత్వం చిత్రితమయింది. పంచపది (మత్తేభం)లో వీరరసా విష్కారకంగా ఓ జోగుణానికి తగిన ప్రౌఢ రచన చేయబడింది.

"హంస కారండవాకీర్ణాం వన్దే గోదావరీ నదీమ్!
క్షిప్రం రామాయ శంస త్వం! సీతాం హరతి రావణః''

హంసలతో బెగ్గురు పక్షులతో ఒప్పుచున్న గోదావరీ నదీ దేవతకు నమస్కరిస్తున్నాను. రావణుడపహరించిన వార్తను శీఘ్రంగా తెలియజేయవలసిందిగా ప్రార్థిస్తుంది. ఈ విధంగా వాల్మీకంలో చేతనాచేతన జగత్తుకు ప్రాతినిధ్యం వహించే విశ్వ భావనా సమర్పకంగా రచన మానవీకృతం కావడం గొప్ప సృజన విశేషం.

కల్పవృక్షంలో గోదావరీ నది గురించి ఈ భాగం చివరలో ఉంది. ముందుగా వచనంలో స్వతంత్రమయిన భావ రూపం 'తన బిడ్డను తన్నుకొని'' మింటిలో పోయే "గృధ్రాన్ని గుర్తు పట్టి'' "నేల మీద పరుగెత్తే'' మహా నదీ దృశ్యం ఆ కర్షణీయంగా ఉంది. గోదావరీ మహా నదిలో ప్రేమ పూర్ణమయిన మాతృమూర్తిని దర్శిస్తుంది. ఈ ఉపమానం విశ్వనాథ కల్పన. దీని తరువాత షట్పదుల్లో గోదావరీ వర్ణనం చేయబడింది.



బిందువు బిందువు మధ్య దీపించే "సుకృత సందోహ విమల" జలరూపంగానూ, భక్తితో నమస్కరించే జనుల పాపాల్ని నాశనం చేసే "ఛందోవతా రంగానూ, దేవతాస్త్రీల సీమంత సిందూరం చేత రంజితమైన వాహిని గానూ రామునిచేత భక్తితో అభినందిత రూపంగానూ, వినుత అయింది. మరో గొప్ప భావరూపం, "భూనందనా ప్రార్థన'' చేత ఆనందంతో ముందుకు వచ్చే తరంగాలతో తటాన్ని స్పృశించే వర్తనం, ఉదారమైన హృదయాకృతిని సూచిస్తూంది. పుణ్యప్రదం, అఘ వినాశిత్వం, భక్తిచేత ప్రీతి పొందే రూపం, ప్రార్థనా వశమయిన దయా హృదయంతో కూడిన గోదావరీ ప్రభావం క్షోభ పొందిన మనస్సును ఎంతో కొంత శాంత పరచడాని కుపకరిస్తూంది.

దీని తరువాత వచ్చే వచనంలో ఈ సందర్భానికి సంబంధించిన పూర్వ భాగం గొప్ప అనుభూతి మయమైంది. సీత గోదావరితో "తల్లీ! మేమిద్దరమూ కలిసి రేపు'' స్నానానికి వస్తారని ఎదురు చూడవద్దని చెబుతుంది. ఎందుకంటే "ఆ పుణ్య వేళ రాక్షస గ్రస్తమయిన దమ్మా!'' అని దుఃఖార్త అవుతుంది. రేపు అన్నదమ్ములు మాత్రమే వస్తారు అంటుంది. వారు ఎలా ఉంటారంటే, ఈ స్థితిలో "వృషోత్సర్జన వేళా కేతనీభూత స్తంభ ద్వయంబు వోలె'' అని గొప్ప ఉపమానం! విశేష సందర్భాల్లో వృషాన్ని వదిలేసే (దాన్ని ఏ పనులకూ ఉపయోగించరు) వేళ గుర్తుగా భూమిపై పాతే రెండు స్తంభాల్లాగా పరి దీన శుష్క దేహాలతో కనిపిస్తారనీ పలుకుతుంది. వారిని గుర్తు పట్టే ఆనవాళ్ళు కూడా చెబుతుంది. "అన్న కనులలో జలముండును, తమ్ముని కనులలో అగ్ని యుండును''. తాను పోయినది దక్షిణ దిశయనీ చెప్పమనీ ప్రార్థిస్తుంది. జలం-వేదనలోజారే కరుణా తరంగిత రూపానికీ, అగ్ని-కోపంతో కూడిన ఉద్రేక జ్వాలా రూపానికీ ప్రతీకలుగా నిలుస్తాయి. ఈ భాగం విశ్వనాథ స్వతంత్రమయిన సృజనావిష్కారానికి పతాకగా ఉంది. కరుణ రసోపేతంగా నిర్వహింపబడింది.

రామాయణ కల్పవృక్షంలో ఈ భాగంలో (1) కవి స్వతంత్రమైన కల్పనలో వాల్మీకి దర్శనంలోని భావ స్థానాలు సువివృతిని పొందాయి. (2) రచనా రూపమూ ఛందోవైవిధ్యంతో ప్రదర్శితమయింది. కథలో ఉత్పన్నమయిన అసాధారణ స్థితినీ మలుపునూ సూచించడం కవి ఉద్దేశం కావచ్చు (3) మానవీకరణ ప్రక్రియలో వర్ణనా ప్రియంగానే కాక వాల్మీకంలోని అనుభూతి ప్రదంగానూ కల్పన వెలసింది. ఇందులో సీత హృదయ సంపరివేదనం, మానవేతర బంధం, కౌటుంబిక వాతావరణం, శ్రీరాముని ప్రేమ-విక్రమ వ్యక్తిత్వాలతో కూడిన సృజన రూపమూ - రచనాశిల్పమూ సమాలోచనానికందుతాయి.

# ౨. సంతాప శిఖరం

వాల్మీకి రామాయణం ఏ భాషలో వెలువడే రామాయణ కథకయినా మూలాధారంగా ఉండడం సహజం. మహర్షి మహాకృతి దర్శనంతో వెలువడిన విశ్వనాథ రామాయణ కల్పవృక్షంలోని సృజన చేతనలో ప్రతిభావంతమయిన స్వతంత్ర రూపాన్ని తులనాత్మకమైన ప్రాతిపదిక పయి సహృదయుల దృష్టికి తీసుకొని రావడమే ప్రస్తుతోద్దేశం. మూలంలోనూ మరే ఇతర కృతుల్లోనూ లేనిదీ విశ్వనాథ స్వీయమయిన మౌలికతను భావింపజేసే కావ్య ప్రపంచాన్ని గుర్తించడమూ అవసరం. ఈ సందర్భంలో 1) కథాంశాలకూ 2) స్థితి లేదా సన్నివేశాలకూ 3) పాత్రోన్మీలనానికీ 4) వర్ణనలకూ 5) తాత్త్విక రూపానికీ సంబంధించిన అంశాలు విశ్లేషణ కందుతాయి. ఇవి ఒక దానితో మరొకటి సంబంధం కలిగి ఉంటాయి. ఆయా అంశాలు పొందే ప్రాధాన్యం దృష్ట్యా విభాగార్హతను పొందడం జరుగుతూంది. అయితే మూలంతో ఏదో ఒక విధంగా సంబంధం లేకుండా ఉండే వీలు లేదు. వాల్మీకి రామాయణంలో (1) సందర్భాన్ని బట్టి అవకాశానికి వీలయ్యేవీ (2) సూచితమయినవీ (3) అవగాహనలో చింతనలో స్ఫూర్తికి వచ్చేవీ (4) నిర్మాణంలో అవసరమనుకున్నవీ, ఔచితిని పొందినవీ (5) కవి అంతర్వ్యక్తిత్వంచేత ప్రేరితమయినవీ కల్పవృక్షంలో స్వతంత్రమయిన సృజన రూపాన్ని పొందాయి. వాల్మీకి కాలం తరువాత సాహిత్య సామాజిక తాత్త్విక పరిణామాల్లో అనేక మయిన మార్పులు వచ్చాయి. ఎంతో సంపన్నమయమయినాయి. ఆ సంపద ప్రభావం వాల్మీకి తరువాత వచ్చే కవుల పయి రామాయణ రచనలో అనివార్యమవుతూంది కూడా. మూలంలోని ప్రధానమయిన విషయాన్ని వదలకుండా ఆకులూ పూలూ పండ్లూ సుగంధం అందం ప్రయోజనం అనుభవంతో వృక్షంలా స్థల కాల మనోధర్మ భేదాల్ని బట్టి భిన్నత్వాన్ని పొందడమూ జరుగుతూంది. ఇదొక అవసరమయిన ప్రయత్నంగానూ రూపొందుతూంది.

కల్పవృక్షంలో ప్రధానమయిన కథలో సావయవ సమగ్రతను పొందుతూనే స్వతంత్రమయిన ప్రపంచాన్ని భావింపజేసే ప్రతిభావంతమయిన భాగాలూ ఘట్టాలూ సన్నివేశాలూ దృష్టికి వస్తాయి. ఈ మహాకృతి తెలుగు సాహిత్యంలో కావ్య కళనూ సమాజ జీవనంలో లౌకికతనూ తాత్త్వికతనూ కలిగి విరాట్ స్వరూపాన్ని పొందింది. చేతన మరియు అచేతనతో కూడిన జగద్రూపంలోని 1) రామణీయకత మరియు 2) ఆధ్యాత్మికత అనే రెండు పొరలు అనుభవానికి వస్తాయి. ఈ సంవిధానం కల్ప



వృక్షంలో ఆరంభం నుండీ సమాప్తివరకూ జీవ వంతంగా నిర్వహింపబడింది. ఈ మహారచనలో వాల్మీకంలో కనిపించనివీ సూచితమయినవీ అనేకం ఘట్టాలుగా సన్నివేశాలుగా పూర్ణతనుపొంది స్వతంత్రమయిన అస్తిత్వాన్ని కలిగి ఉన్నాయి. వాటిని గుర్తించి సమాలోచనం జరపడమే ప్రకృతోద్దేశం. ఇవీ దీని పరిమితులు.

కిష్కింధ కాండలో వాలి వధానంతరం తార పొందిన శోక తప్తమయిన స్థితి చిత్రణం కరుణ రసాత్మకమయింది. వాలి శ్రీరాముని బాణం చేత హతుడయిన రోజు రాత్రి గడచింది. మరునాడు సూర్యోదయ సమయంలో తార "దుః ఖోగ్రసంతాపం"తో కూడిన విషాద సన్నివేశం కవితాత్మకతను పొందిన భాగం పేర్కోదగిందీ. వాల్మీకి రామాయణంలో ఇరవై మూడో సర్గలో లోకం నుండి వీడి పోయిన పతియైన కపిరాజు వాలి ముఖాన్ని మూర్కొనీ వేదనలో

"తత స్సముపజిఘ్రన్తీ కపి రాజస్య తన్ముఖమ్।
పతిం లోకాత్ చ్యుతమ్ తారా మృతం వచన మబ్రవీత్"

అని తార మాటలతో హృదయాన్ని కదిలింపజేసే గొప్ప సన్నివేశం, కరుణరస ప్రసారంతో ప్లావితమయింది. దీనికిదే సాటిగా నిలిచింది. ఇక కల్పవృక్షంలో దీన్ని అనుసరించిన భాగం పేర్కోదగిందీ సన్నివేశ నిర్మాణంతో వ్యాఖ్యాన విశిష్టంగా పెంచబడింది.

రామాయణ కల్పవృక్షంలో వాల్మీకి రచనకు అదనంగా అందంగా మరో చిన్న ఘట్టం చిత్రితమయింది. ఇది స్వతంత్రమయిందీ. పది పద్యాల్లో ఉంది. మొదట చివర స్రగ్విణి వృత్తం ఉపయోగించడం జరిగింది. ఇంద్రునిచే పొందిన మౌక్తిక హారంతో శక్తి సంపన్నుడయిన వాలి ఒక వైపూ, శ్రీరాముని మైత్రి కారణంగా గుర్తుగా అలంకరింపబడిన "గజ పుష్పి" మాలతో సన్నద్ధుడయిన సుగ్రీవుడు మరొకవైపూ ఉన్నారు. ఇరువురి మహా యుద్ధంలో నిర్ణాయక మయిందీ 'గజ పుష్పి'. విశేషమయిన ప్రభావ ముద్ర కలిగిందీ. రచనలో 'స్రగ్విణి'గా పరిణమించింది, నిలిచింది. మిగతావి ఎనిమిది గీత పద్యాలు. ప్రకృత కథా సందర్భానికి సముచితంగా సాంద్రమయిన విషాద భావ చలనంతో ఆకర్షిస్తుందీ భాగం.

ఆ ఉదయ సమయంలో అక్కడి ప్రకృతి నేపథ్యంతో కథాగతమయిన అంశం పరియోజితమయింది. ఆ రోజు సూర్యోదయాని కొక ప్రత్యేకత ఉంది. తార శోక

'సంతప్త స్థితి, మునుముందు మలుపులు తిరిగే బ్రతుకులూ, ఆపైన రాజ్యానికి అధిపతిలో మార్పూ, ఇట్లా ఒక విచిత్రమయిన పరిస్థితుల్లో క్లిష్టమయిన మానసికమైన స్థితి చలనంతో సంఘటన విషాదంలో శోక రూపాన్ని ధరించింది. ఇక్కడ వృత్త వైశారద్యం కన్నా సులభమైన నిర్మాణంలో గీత పద్యాలు చోటు చేసుకున్నాయి భావ ప్రసారంపై దృష్టితో కవిత్వ కళ వెలసింది. ఇక విశేషవృత్తమయిన స్రగ్విణిలో తార దుఃఖ సంతప్త హృదయ స్పందన రూపం ఆకర్షణీయంగా బింబితమయింది.

శ్రీరాముని బాణ ఘాతం చేత వాలి మృతితో తార దుఃఖం పట్టశక్యం కానిదిగా ఉంది. నేలపై దుమ్ములో పడి ఉన్న భర్తను చూచి ఒక జ్ఞాపకం తరువాత మరొకటి తరుముకొని వస్తూంది. దుఃఖ పరంపరకు హద్దులేకుండా ఉంది. ఆ రాత్రి చీకట్లో భర్త కళేబరం ప్రక్కనే పడి ఉండీ దుఃఖించీ అలసీ ఎపుడో కాస్త విరామం లభించిందనుకుంటే, పొద్దునే వెలుగుతో కళ్ళు తెరచుకోగానే ఎదుట! వాలి మృత దేహం దుఃఖాన్ని ఉద్దీపింపజేసింది. సూర్యోదయమయింది. పొద్దెక్కుతూంది. తార "సంతాప మీ మాత్ర చల్లారు నంచెంచగా! అంత కంతంత దుర్వారమై ఘోరమై" అతివేలమయి అందరినీ నిశ్చేష్టితుల్ని చేసింది. మరో దృష్టితో అది సూర్యసూతి కనువయిన కాలం! దూర దూరంగా ఉన్న ఛాయ దగ్గర దగ్గరవుతూంది. వసంతకాలం, పొద్దెక్కే కొద్దీ గ్రీష్మస్పర్శ అనుభవానికి వస్తూంది. చివురులో ఎర్రదనం కాఠిన్యాన్నీ, మెత్తదనం మార్దవాన్నీ సూచిస్తూంది.

"అకట! మాధవుడును గ్రీష్మనంత పెళుసు
  చివురు ఎర్రన మెత్తన చెప్పుచుండె
వాని కాఠిన్యమును మార్దవంబు కలిపి"

శ్రీరాముని వ్యక్తిత్వంలో సహజంగా ఉన్న, రెండు విరుద్ధ గుణాలు తలపుకువస్తాయి. ఇవి అవసరానికి ప్రయుక్తమయ్యేవీ. "మాధవ" శబ్దం వసంతునితో పాటు విష్ణువునూ భావింపజేస్తుంది. శ్రీరాముని అవతార విశేషాన్ని మెరపిస్తూంది. మాధవం నుండి భావన మాధవుని వైపుకు నడిపిస్తూంది. వాలి వధ లౌకిక స్థాయిలో ఎట్లా ఉన్నా ఎవరి కెట్లా అనిపించినా ఆంతరంగా జరగవలసిన ఘటన దైవ ప్రేరితంగా తోస్తుంది. మహాదారుణ స్థితిలోనూ తాత్త్విక స్పర్శ అనుభూతమవుతుంది. ఉన్న



సంస్థితిలో మనసును సమాధానపరుస్తుంది. సమత్వాన్ని చేకూరుస్తుంది. ఈ భాగంలో రేఖా మాత్రంగా తాత్త్విక స్పర్శ ఊహకందుతుంది.

సూర్యుని కిరణాలు అంబుజాల్ని వికసింపజేసేవి మాత్రమే కాక పొద్దెక్కే కొద్దీ సూర్యశిలల శౌర్యానికి "శిక్షా గురువులు"గాను అవుతున్నాయి. ఇంకాసేపటికి మొల్లల్ని విశీర్ణం చేస్తున్నాయి. బహువిధాలుగా ప్రభావాన్ని నెరపుతున్నాయి. శ్రీరాముని తేజశ్శక్తి కూడా ఇలాంటిదే. ఈ వర్ణనంతో కథలో భేదిస్తూ చివర సమన్వయం పొందే వివిధాంశాల సమాకలనాన్ని సూచించడం జరిగింది.

మెట్టయైన కిష్కింధ సమీప ధాత్రి
సమముగా నున్న అటవి వృక్షముల తలల
చివర లందు అరుణాతప శ్రీ వహించె
వాలి మై నెత్తురులు జాలు వారినట్లు"

కిష్కింధ మెట్ట ప్రదేశంలో ఉంది. సమీపంలో అవనిపయి సమంగా పెరిగిన చెట్ల తలల చివురుల్లో ఎర్రని ఆతప ప్రసారం "వాలి శరీరం పయి నెత్తురులు జాలువారి"నట్లుంది. ప్రకృతి దృశ్యంలో ఈ భావన పాత్ర స్థితి కనుగుణమైన భావ సాంద్రమయిన ఉపమానంతో కవితాత్మను ప్రకాశింపజేస్తుంది.

కపి ప్రజలు అక్కడ చేరారు. ఎదురుగా ఎండపడుతూంది. ఆ ఎండను సహింపలేని వారు కనుబొమలు చిట్లించి చూస్తున్నారు. కొంత కపి చేష్ట సహజమయింది కూడా. ఆతప మార్గంలో వెలుగు ఉంగరాలు కట్టి సాగుతూంది. ఇది ప్రకృత సందర్భంలో "వెలుగుంగరములు గుమ్ములుగతోచె" యముడు కొనిపోవు వాలి ప్రాణములవోలె" కనిపించింది. వాలి శరీరం నుండి తీసిన బాణం కాస్త దూరంలో పడిఉంది. దాన్ని సమీపించడానికి భయపడుతున్నారు. రెప్పల క్రింది నుండి చూపులు నిగిడించి చూస్తున్నారు. జరిగిన దాన్ని గురించి దుఃఖమూ విచారమూ, జరగబోయే దాన్ని గురించి సందేహమూ భయమూ ఆవరించిన ప్రజల మనస్సు నిస్తబ్ధంగా ఉంది.

"ఋష్యమూ కాటవీ తాళ వృక్ష శేఖరములు రక్త జపా తోరణములు గాగ
సితజలద పంక్తి ప్రతిబింబ సిద్ధివాలి గాయమును ప్రదర్శించెడు గతిదలిర్పె"

ఋష్యమూకం అడవిలో పొడవుగా పెరిగిన తాళ వృక్ష శేఖరాలు ఎ(రని దాసాన పుష్పతోరణాలుగా ఉన్నాయి. అందులో తెల్లని మబ్బు (ప్రతిబింబించి వాలి గాయాన్ని (ప్రదర్శిస్తున్నట్లుంది. ఉదయం పడే అరుణ వర్ణం వాలి శరీరంపై రక్తాన్ని పదే పదే తలపిస్తూంది. ఆ సమయంలో స్థితిముద్రను పొందిన ఈ (ప్రకృతి దృశ్యంతో తార దుఃఖం అతిశయించింది. సన్నివేశాన్ని పాత్రగతంగా తత్కాల మానసిక స్థితిని బట్టి తీర్చడం ఇందులో (ప్రత్యేకత. ఇది శోకతప్తమయింది.  కరుణాత్మకమయింది. విషాద ముద్రను పొందింది. ఈ స్థితిలో తార "దుఃఖో(గ్రసంతాపమెంతేని చల్లారు నంచెంచగా అంతంత దుర్వారమై ఘోరమై" అతిశయించింది. ఎవరూ దగ్గరికి వచ్చి సాంత్వనం చేకూర్చే సాహసం చేయలేక పోతున్నారు. వాళ్ళు ఇంచుమించు అదే దుస్థితిలో నిమగ్నమై ఉన్నారు. ఇక్కడ చివర (స్రగ్విణీ వృత్తం (ప్రయుక్తమయింది.

"తార దుఃఖో(గ్ర సంతాప మింతేని చ
ల్లారు నంచెంచగా నంతకంతంత దు
ర్వార మై ఘోరమై వచ్చి వారింపగా
నేర నట్లయ్యె సందీప్త మై ఎవ్వరున్"

మొదటి దానిలోనున్న "ఈ మాత్రకు" బదులు చివరి దానిలో "ఇంతేని" మార్పుతో పునర్దుఃఖ సూచనగా పునరావృత మయింది. మిగతా గీత పద్యాల్లో స్థలంతో కాలంతో స్థితితో యోజితమయిన సాంద్రమయిన మానసికమైన భావరూపాలు వెలసాయి. విశ్వనాథ ఆలోచనలో మానవ జీవితానుభవంలో దైవ (ప్రమేయంతో పాటు అనివార్యమయిన దుఃఖం చేత వ్యాకులమయిన మానసిక స్థితి చిత్రణం కలిగిందీ భాగం నిర్మాణంలో అపూర్వమయిన వ్యక్తిత్వాన్ని కలిగింది. (ప్రతిభాపూర్వక మయిన ఉపజ్ఞలో భాగంగా అవతరించింది.

h h h



# 3. దర్శన రూపం

## I

వాల్మీకి రామాయణం సుందర కాండలో సీతాన్వేషణంలో హనుమ అశోక వనం చేరాడు. ఒక పెద్ద చెట్టుపయి నుండి రాక్షసీ గణం చేత చుట్టబడిన సీతాదేవిని చూచాడు. ఆలోచనలో "తర్కయామాస సీతేతి కారణైరూపపాదిభిః" ఆ స్థితిని బట్టీ లక్షణాల్నీ బట్టీ కారణాలతో వివేచన చేసి ఆమె 'సీతయే'యని నిర్ణయానికి వస్తాడు. ఈ సందర్భంలో హనుమ చూచిన శోక సంతప్తయై నిస్సహాయంగా ఉన్న ఆమె స్వరూప చి(త్రణం 17వ సర్గలో 14 శ్లోకాలలో ఉంది ఒకటీ. ఆ తరువాత అక్కడికి రావణుని రాకతో భీతయై క్షోభను పొందిన సీత స్వరూప చి(త్రణం 19వ సర్గలో 23 శ్లోకాలలో ఉంది మరొకటీ. ఈ రెండు భాగాల్లో దుఃఖానికి మూలం ఒకటే. మానసిక తలంపయి అవి (ప్రకటిత మయిన రూపాలు వేరు. మొదట దానిలో కన్నా రెండోదానిలో గభీరమయిన సంవేదన క్షోభ ఎక్కువగా చి(త్రితమయినాయి. ఈ స్థితి సాంద్రమయిన భావరూపాలతో ఆవిష్కృతమయింది. రెండు భాగాలూ ఒక దాని కన్న మరొకటి ఉదాత్తమయిన కవితా రామణీయకతను పొందడమూ సమాలోచన కందుతుంది. ఈ రెండు భాగాలూ పరస్పరమూ సంబంధం కలిగినవీ. అనుభూతి (ప్రదమయినవీ. మొదటి దాని విస్తరణంగా రెండోది అనిపిస్తుంది. కాని దేని స్థానాన్నిబట్టి దానికో విశిష్టత ఉంది. తత్కాలాల్లో మనోభావ సమర్పకాలుగా ఉన్నాయి.

హనుమంతుడు మొదటి సారి చెట్టు పయి నుండి చూచిన సీత శోక సంతప్తయయి ఉన్న స్థితి దుఃఖ వలయావృత మయింది. తనను ఎత్తుకొని వచ్చిన రావణుడు తనను సమీపించినపుడు ఎదురుగా ఉన్న స్థితి క్షోభాకులిత మయింది. నిస్సందేహంగా భిన్నంగా ఉంటాయి. ఇది సహజం. కథలో ఉన్న ఈ (ప్రత్యేకత రచనలో (ప్రతిఫలించింది. ఈ స్థితి సంవేదనా జ్వాలామయమయింది. ఆమెకు భయం వేసింది. దుఃఖం పొంగి పొరలింది. వ్యాకులత పొందింది. పతిభావనలో విలీనమయింది. దుఃఖ మూలం ఒకటే అయినా మానసికంగా పొందే (ప్రభావ ముద్రలు వేరుగా ఉన్నాయి. మారిన స్థితి పరమ దారుణమయింది. కల్పవృక్షంలో ఈ రెండు భాగాలు ఒక దాని కన్న మరొకటి పరమోత్కృష్ట మయిన అనుభూతి సుందరంగా తీర్చబడినాయి వచనాన్ని మినహాయించి 18 పద్యాలున్నాయి అంతే. తెలుగు కావ్య (ప్రపంచంలో అపూర్వమైనవిగా అనుభవానికి వస్తాయి. అంతవరకూ ఆమె దుఃఖం ఒక స్థాయిలో ఉంది రావణుని రాకతో శిఖర భూతమయింది. ఇది రెండో భాగాన్ని

మిన్నగా నిలుపుతూంది. ఈ కారణంగా వాల్మీకంలో ఒక భాగంలోని భావ రూపాలూ వాటిని పోలినవీ మరోభాగంలోకి ప్రవేశించాయి. కల్పవృక్షంలో ఈ రెండు స్థితుల నిర్వహణం భిన్నమైందీ స్వేచ్ఛాయుతమైందీ తులనాత్మకంలో దేని ప్రత్యేకత దానిదిగా దర్శనమిస్తాయి. మొదటి భాగంలో మూలంలో

"(1) మృణాళీ పంక దిగ్ధేవ విభాతి న విభాతి చ"

హనుమ చూచిన ఆ సమయంలో సీత పంకం అంటిన తామర తూడులా ప్రకాశిస్తూనూ ప్రకాశించకుండానూ" ఉంది. ఆ సమయంలో దయనీయమై దుస్థితి ధ్వనితమవుతూంది ఇది కల్పవృక్షంలో లుప్తమయింది.

(2) "మృగ కన్యామివ త్రస్తాం వీక్ష మాణాం సమంతతః" అటూ ఇటూ అంతటా చూస్తూ ఉన్న, "భీతిచెందిన ఆడు లేడి వలె" ఉంది. హరిణంలోని సౌకుమార్యం సుకుమారమైన హృదయ స్పందనం వ్యంజితమవుతూంది. ఇది కల్పవృక్షంలో వదలివేయ బడింది.

రెండో భాగంలో తన కడకు వచ్చిన రావణుని చూచిన సీత "(1) ప్రావేపత ప్రవాతే కదళీ యథా" (పెను గాలికి అరటి చెట్టు లాగా కంపించింది.) భౌతిక సౌకుమార్యం మానసిక సౌక్ష్మ్యత ప్రతీయ మానవుతూంది. ఇదీ కల్పవృక్షంలో లేదు.

(2) "వేదీమివ పరామృష్టాం / శాంతామగ్ని శిఖామివ" పరులు రాకూడని వారు (అపవిత్రులు) ప్రవేశించిన యజ్ఞవేది వలె ఉంది. వైదికమయిన భావ రూపంతో ఉదాత్తమయింది. ఇదీ కల్పవృక్షంలో మృగ్యమయింది. (3) హనుమంతుడు "దదర్శ దుఃఖార్తాం నావం సన్నామివార్ణవే" సముద్రంలో కొట్టు మిట్టాడే నావ వలె ఉన్న సీతను చూచాడు. ఆమె దుస్థితి వాస్తవ జీవన దృశ్యంతో ఆపూర్ణమయింది. ఇదీ కల్పవృక్షంలో వదలబడింది. ఇట్లా మూలంలో రెండు భాగాల్లోని అనేకమయిన భావరూపాలు తెలుగులో అదృశ్యమయినాయి. ఎక్కడో మరో చోట వీటి ప్రతి రూపాలూ ప్రతిస్పందనలూ ఉంటే ఉండవచ్చు. అది వేరే విషయం. వాల్మీకంలో వీటిలో చాలావరకు 1) ప్రకృతి 2) ప్రాణికోటి 3) పౌరాణికం 4) మానవీయం పరంగా గభీరమయిన అర్థస్ఫూర్తిని కలిగిస్తూ మహాకావ్యాన్ని విశ్వమయం చేస్తూంది. అన్ని విధాలా గొప్పవయిన ఉపమానాలూ సాంద్రమయిన అనుభూతి భావరూపాలతో శ్లోక పాదాలు శ్రవణ సుఖ ధ్వని తరంగాలుగా కదలుతాయి. సన్నివేశంలో స్థితి చిత్రణం



పాత్రగతమయిన ఔచితీ శోభతో ఎంతో వ్యాఖ్యానికి అర్హంగా ఉన్నాయి. ఈ రెండు భాగాల్ని కలిపిచూస్తే మొత్తం మీద వీటిలో కొన్ని భాగాలు కల్పవృక్షంలో ప్రవేశించాయి. ఇవి నాలుగు విధాలుగా (1) కొద్ది మార్పుతో (2) వివరణంతో (3) యథాతథంగానూ (4) స్వతంత్రమయినవీ విశ్లేషణ కందుతాయి. (1)"అభూతేనాపవాదేన కీర్తిం నిపతితామివ" నిజం లేకుండా (నిరాధారంగా) పొందిన అపవాదంతో పడిపోయిన కీర్తివలె అన్నది కొద్ది మార్పుతో "అపవాద లగ్నమయిన కీర్తి వలె" అనీ

(2) "ఆమ్నాయానామ యోగేన విద్యాం ప్రశిథిలామివ" (అభ్యాసంలేక పఠన పాఠనాదులు లేక నష్టమయిన వేద విద్యవలె) దీనికి వివరణంగా "స్వర విహీనమయిన నిష్ఫలమయిన వేద విద్యవలె"- అనీ

(3) "ఆయతీమివ విధ్వస్తాం" దీనికి యథాతథంగా "విధ్వస్తయయిన ఆయతింబోలె" నని ఇంకా "ఛిన్నాం ప్రతిహతాం భూమౌ శాఖామివ వనస్పతేః" ఛిన్నయయి ధాత్రిబడిన కొమ్మ వలె"అనీ యధాతధంగానూ కనిపిస్తాయి.

(4) మూలానికి సాగింపుగా స్వతంత్రంగా వర్తమాన స్థితిపై దృష్టితో

a) "కలి సమాశ్రిత యయిన ధర్మ దేవతం బోలె" అనీ

b) "పరలోక భావనా పరిత్యక్త యయిన సంఘ వ్యవస్థ వలె" అనీ స్వతంత్రమయినవీ. ఈ నాలుగు విధాలూ స్థూలంగా కల్పవృక్ష కవి దృష్టిలో మరో నిర్మాణ పద్ధతిని సూచిస్తాయి. వీటి మధ్య నుండి ఉద్గమించిన ప్రతిభా పూర్వకమయిన ఉపజ్ఞారూపం స్వతంత్రమయిందీ, కవి వ్యక్తిత్వాన్ని నిలిపేదీ ఉండనే ఉంది.

చిత్రమేమంటే వాల్మీకంలో ఉన్న ఈ రెండు భాగాల్లో నుండి ఎన్నబడిన భావరూపాలూ వాటిని అనుసరించినవీ కొన్ని కల్పవృక్షంలో వచనంలో వెలసాయి. ఈ సన్నివేశ నిర్వహణం గురించి, అప్పటివరకూ సాగివచ్చే ఛందో రామణీయకత అభివ్యక్తి సౌందర్యం రచనా శిల్పంతో ముఖ్యంగా ఈ విశేష సందర్భంలో పద్యంలో రచన మరింత మెరుగుగా ఉండేదన్న అభిప్రాయమూ ఉంది. వాల్మీకి రామాయణంతో పరిచయం ఉన్న వాళ్ళకూ తులనాత్మక పరిశీలనంలోనూ ఈ సందర్భంలో అందులో ఎలా ఉందో తెలుసుకునే ఉత్సుకత కలిగిన వాళ్ళకూ ఈ వచన పద్ధతి కాస్త అసౌకర్యంగా ఉండే అవకాశం ఉంది. అనుభూతి సాంద్రమయిన భావ రూపాలకు తగిన రచనా రూపం లేదన్న అభిప్రాయానికీ దారి తీస్తూంది. అయితే వచనంలోనూ

అభివ్యక్తిలో నడకలో ఒక రీతితో వేదనలో ఆవేశ స్థాయిని నిలిపే ఆవేగంతో సుందరత అనుభూతమవుతుంది. ఇది కాస్త ఊరట కలిగిస్తూంది. వాల్మీకంలో ఈ రెండు భాగాల్లో ఒక దాని కన్నా మరొకటి విశిష్టంగా కరుణ రస నిర్భరమైన భావరూపాలు సంవేదనా దీప్తంగా ఉన్నాయి. సార్థ రామణీయకతతో మనోహరమైన నాద తరంగాల్లో శ్లోకపాదాలు ఆకర్షిస్తాయి. కళాత్మకతతో పాటు సంస్కృత భాషా సహజమైన సౌందర్య లక్షణమూ ఉపకరించింది. ఇటువంటివే కొన్ని సందర్భాల్లో కల్పవృక్షంలో తెలుగు పద్యాల్లో రచనా శిల్పంతో చక్కగా నిండుగా ఆవిష్కృతమయినాయి.

మొత్తం మీద కల్పవృక్షంలో రెండు భాగాలూ వాల్మీకంలోని సన్నివేశాల ప్రేరణతో స్వతంత్రమయిన భావోల్బణంతో స్వేచ్ఛా సముద్వేగంతో స్వీయమైన స్పందనానుభూతితో అపూర్వమయిన కవితారూపాల్ని పొందాయి. వాల్మీకి కాలం తరువాత వేల ఏండ్లపైన మరో భాషలో అవతరించే మహాకృతిలో ప్రత్యేకతలు అనివార్యాలవుతాయి. ఈ సందర్భంలో కవి సృజన సంకల్పాన్ని నిర్మాణ విధానాన్ని ప్రయోజన దృష్టినీ ఆ భాషలో ప్రథితమయిన కావ్య పరంపరా మార్గాన్నీ గుర్తించవలసి ఉంటుంది. ఒక మహాకవి చేత ఏ విధమయిన ఆవిష్కారాన్ని పొందిందో ఆవిధంలోనే ఆ కలిగే అనుభవాన్ని పొందడం స్వీకరించడం కుదరదు. మరొకరి ఆలోచనల కనుగుణంగా ఏ ప్రతిభావంతుని మనస్సు నుండీ సృజనరూపం ఉద్భవించదు. కల్పవృక్షం విశ్వనాథ ఉపజ్ఞాసహితమయిందీ, మహర్షి వాల్మీకి దర్శన ప్రభావంతో సంపన్నమయిందీ. వీటిని గుర్తించడం కూడా అవసరం.

ఈ విధమయిన స్వరూపాన్ని పొందడానికి గల కారణాల్ని అన్వేషిస్తే ఎకడమిక్ ఎక్సర్‌సైజ్ (academic exercise)లో కొంతవరకు సమాధానాలు దొరకుతాయి.

1) కవి సంప్రదించిన వాల్మీకి రామాయణం గ్రంథం ప్రతి తెలుగు లిపిలో వేరుగా ఉండొచ్చు. పాఠాంతరాలు ఉండవచ్చు. కల్పవృక్షంలో చోటులేనివి అందులో లేకపోవచ్చు.

2) సీత గురించి భావ చిత్రణల్లో కవి ఉద్దేశంలో అధికంగానో లేదా పునరావృత్తంగానో తోచవచ్చు.

3) స్వతంత్రమయిన కవిత్వ వ్యక్తిత్వంపయి బలమయిన అభిలాష వల్ల మూలంలోని వరసలో కొన్ని జారిపోవచ్చు.



4) ప్రస్తుత సన్నివేశాల్లో కవి తీర్చదలచుకున్న పద్ధతి వేరుకావచ్చు. దృష్టి భేదం ఉండవచ్చు. మరో నిర్మాణ శిల్ప ప్రయోజనాన్ని ఆశించవచ్చు.

ఇలాంటివి పక్కకు పెడితే రామాయణ కల్పవృక్షం రామాయణ కథకు సంబంధించిన ప్రధానమయిన ప్రణాళికలో భావ సూత్రంలో వాల్మీకి రామాయణాన్ని అనుసరించే నిర్వహింపబడింది. ఆకృతిలో తనదైన ప్రత్యేకతనూ వహించింది.

## II

కల్పవృక్షంలో పర రాత్ర ఖండంలో అశోక వనంలో హనుమంతుడు చెట్టు పయి నుండి మొదటిసారి సీతను చూచినపుడు ఆమె ఉన్న దైన్య స్థితి, రావణుడు సమీపించినపుడు పొందిన దైన్య రూపం భిన్నమైన మైన భావనా జగత్తులను పొందాయి. ఈ రెండు భాగాలు పద్యాలూ వచనమూ కలిసి ఇరవై **5+1, 13+1** తో కవి స్వతంత్రమయిన వ్యక్తిత్వాన్ని భావింపజేస్తున్నాయి. వాల్మీకి కథా సూత్రాన్ని పట్టుకొని స్వేచ్ఛా గుణంతో సృజనరూపం అవతరించింది. దీని వెనక నుండి ప్రసరించే వాల్మీకి దర్శన ప్రకాశంలో ప్రతిభావంతమయిన భావరూప దృశ్యాలు సమాలోచనాని కందుతాయి ఇవి మూడు స్థాయిల్లో ఆరోహణ క్రమంలో (1) భౌతిక స్థితి (2) మానసిక గుణం (3) ఆంతర చేతనతో తీర్చబడినాయి (I) వాల్మీకి చిత్రణంలో అనుభూతి క్షేత్రం కల్పవృక్షంలో వివృతమయింది. (II) వివేచనతో తాత్త్విక ప్రకాశాన్ని పొందింది. (III) కవిత్వ కళలో తెలుగు పద్య రచనా నైపుణ్యాన్ని వహించింది. ఈ ప్రత్యేకతల చేత విశ్వనాథ విశిష్ట విధం ప్రసిద్ధమయింది.

సీత చిత్రణం, సూక్ష్మభావనామయ మయింది

"చలువయు వేడిమిం పవన సంగతవీధుల సూక్ష్మ సూక్ష్మ
రేఖలుగను తీవ్ర తీవ్రములుగా నయినట్టి విభాగ లక్షణం
బులు నిశితంబుగా నెరుగ బొల్చిన స్పర్శగుణాధికత్వ మం
జుల సుకుమార దేహ యగు క్షోణి సుతామణి స్రుక్కుచెంతయున్"

ఇందులో అనుభూతి వివేచనం స్పష్టంగా పాత్ర నిర్మాణాన్ని గురించి ఆలోచింపజేస్తుంది. సీత శరీరం వివిధ స్థాయిల్లో సూక్ష్మమయిన అనుభూతి రూపాల్ని గ్రహించ గలిగింది. ఇది మానసికంగానూ ఆమె ఇంద్రియ జ్ఞాన విలక్షణతను సూచిస్తూంది. ఇక్కడ వర్ణన కన్నా మనస్తత్త్వ విశ్లేషణ నుండి వివేచనకు ప్రాధాన్యం ఇవ్వబడింది. ఎల్లపుడూ వికార రూపాల్ని చూస్తూ ఉంటే నయనేంద్రియం "మొద్దు"

బారుతుంది. ఎప్పుడూ వికార శబ్దాల్ని వింటూ ఉంటే శ్రవణేంద్రియం సరిగా పనిచేయదు. స్తబ్ధమవుతుంది. అవి తమ తమ గ్రహణ నైపుణిని కోల్పోతాయి. ఆపైన రమణీయమయిన వాటిని చూచీ వినీ ఆనందించే "నేర్పు" సడలిపోతుంది. ఇదొక ప్రతిపాదనం. అక్కడున్న స్థితిని బట్టి స్థాపితమయింది. ఎక్కువకాలం రాక్షసీ గణం మధ్య గడిపే సీత రాబోయే దుస్థితికి భయపడుతూంది. వాళ్ళ మాటలూ చేష్టలూ క్షోభపెడుతున్నాయి. శరీర స్థాయి నుండి మానసిక స్థాయిలో కవి భావన ప్రవర్తమానం కావడాన్ని గమనించవచ్చు. ఆయా ఇంద్రియాల్ని కుంఠితం చేసే ప్రమాదంతో పాటు సహజమైన మానసిక రూపాన్నీ చెదరగొడుతూంది ప్రస్తుత స్థితి. ప్రకృతి వ్యతిరేకమయిందీ. సీత పాత్ర మంజులమూ సుకుమారమూ అయిన రూపంలో భావితమయింది. మంచిని చూడడం మంచిని వినడం వల్ల మానసికంగా సమత స్థిరత చేకూరతాయి. ("భద్రం కర్ణేభిః శ్రుణయామ, భద్రం పశ్యేమాక్షిభిః" అన్న ఉపనిషన్మంత్రం "శుభాన్ని చెవులతో విందుముగావుత శుభాన్ని కన్నులతో చూతుము గావుత") ఈ సందర్భంలో జ్ఞాపకం వస్తుంది.

విశ్వనాథ భావనలో సీతాదేవిలో సూచితమయిన స్పర్శగుణం శక్తివంత మయింది. సాధారణేతరమయిన వ్యక్తిత్వాన్ని భావింప జేస్తూంది. గాలిలో చల్లదనమూ వేడీ రేఖలతో "సూక్ష్మ సూక్ష్మంగా" "తీవ్ర తీవ్రంగా" పరిణమించే స్థితుల్ని చక్కగా లోతుగా తెలుసుకొనే శక్తి కలిగింది. ప్రకృతిలో వచ్చే మార్పులకు సంబంధించిన కదలికల్ని సూక్ష్మంగా గుర్తించగలిగిన మనోమూలంతో కూడిన జీవరూపంతో ఆమెదేహం, విశిష్టమయింది. ఇది ఆంతర చేతనతో పాలితం కావడం దీని విశిష్టత. అందరికీ భౌతికమయిన కరణములు సమానమే. ప్రాణుల్లో అత్యంత సుకుమారమయిన జీవుల అనుభూతి వేరుగా ఉంటుంది. ఇది సంపద వల్ల లభించేది కాదు. జీవ నిర్మతిలో సహజంగా ఏర్పడి విశిష్టంగా ఉండేది. గొప్ప వాళ్ళ జీవితంలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తుంది. ఇది మానసిక జగత్తును ఆవరించింది. ఆంతర చేతనతో పని చేసేదీ. ఈ కారణంగా సుజనులకు "అసత్పురుషాళి"తో కలయిక ఎంతో బాధగా ఉంటుంది. అనిష్టమయిన భౌతిక స్థితిలో బాధను పొందే మానసిక స్థితితో యోజన చేయబడిన సీత పాత్ర కల్పవృక్షంలో చాలా ఎత్తులో నిలపబడింది. వాల్మీకంలో బిందు భావ స్థానం నుండి రేఖలుగా విస్తరించి సీత వ్యక్తిత్వం ఈ సన్నివేశంలో మహనీయమయిన భౌతిక మానసిక ఆంతరస్థితుల్లో చిత్రాకృతి పొందింది.

ఆమెచుట్టూ " దుష్కృత క్షార" ప్రవాహాల్లా రాక్షస స్త్రీలున్నారు, మధ్యలో "సుకృత పయోరాశిలా" సీత ఉంది. తనలోకి ప్రవేశించే క్షారాంబువుల్ని సముద్రపుటలలు బయటికి నెట్టి వేస్తున్నట్లుగా సీత చెడు నుండి తనను తాను రక్షించుకుంటూ ఉంది. చెడుకూ మంచికీ దుష్కృతానికీ సుకృతానికీ, పాపానికీ పుణ్యానికీ మధ్య జరిగే సంఘర్షణలో విశాలమైన గభీరమైన సుకృత మనోరూపంతో తనను తాను కాపాడుకుంటూంది. ఇతర తెలుగు కవుల్లో సాధారణంగా కనిపించని విలక్షణమయిన మనస్తత్వ ప్రకాశనంతో పాత్ర వ్యక్తిత్వాన్ని నిర్మించే లక్షణం ఇందులో వినిపిస్తుంది. మొదటి భాగంలో మూలంలోని బీజ భూతమైన భావం నుండి అవతరించిన కవితా రూపం విశ్వనాథ ముద్రతో భిన్నమయిన రచనా శిల్పాన్ని పొందింది.

రెండో భాగంలో రావణుని రాకతో సీత పొందిన మానసికమయిన క్షోభతో పాటు అంతర్నిహితమయిన ఆత్మ ప్రత్యయమూ స్థాపితమయింది. రామైక్యభావంతో పతి పట్ల విశ్వాసంతో దుష్కృతినీ దౌష్ట్యాన్నీ దహించే, అనల శిఖా తేజంతో ప్రత్యక్షమవుతూంది. వాల్మీకంలో లేని భావరూపాల పరంపరతో రచన గీత పద్యాల్లో పౌరాణిక కథా సందర్భాలతో ఉపమాలంకార సుందరంగా తీర్చబడింది.

ఇవి సీత వ్యక్తిత్వంలో పవిత్రతనూ ఆదర్శాన్నీ పరమార్థాన్నీ పుట్టుకలోని లోకహితాన్నీ భావింపజేస్తున్నాయి.

1. సముద్రంలో సోమకాసురునికి భయపడే త్రయీకాంత వలె
2. హిరణ్యాక్షుని వలన క్రిందు మీదైన ధారుణీ సుందర వలె
3. హిరణ్య కశిపుని సభలో భీతి చెందిన విష్ణు భక్తివలె
4. కార్తవీర్యార్జునుని ముందు ఆవులా దిగులుపడే ఆతిథ్యదేవత వలె. క్లిశ్యమానా

వస్థలో ఉంది. పురాణ కథల్లో మంచిని ఎల్లపుడూ బాధించే చెడు తత్త్వం ఇపుడు అశోకవనంలో సీతను చుట్టుముట్టి ఉంది. మానసికమైన మహా వేదనతో సీత "రివ్వున" వచ్చే "విపరీతపుగాలికి", నాలుగు వైపుల నుండీ "త్రెవ్వినట్లు", లోపల నుండి జల చరాలు లేచి ఎగసి పడుతూన్న తటాకంలా ఉంది.

"రివ్వున వచ్చు చున్న విపరీతపు గాలికి నాల్గుమూలలన్
త్రవ్వినయట్లుగా జల చరంబులు మట్టము నుండి లేచుచున్
త్రవ్వుచు వారి బంధములు వ్రీలగ బిందు సమూహ భావమున్
విప్పిన దైన్య మూర్తియయి వ్రేలెడు నట్టి తటాకమోయనన్"

బయటికి దుఃఖాశ్రు రేఖలతో లోపల వేదనా తప్త హృదయంతో ఉందీ. అయితే ఆమె లోపల ధైర్యమూర్తిత్వాన్ని కలిగిందీ.

"ఆకృతి రామ చంద్ర విరహాకృతి కన్బొమ తీరు స్వామి
చాపాకృతి కన్నులన్ ప్రభు కృపాకృతి కైశికమందు రామ
దేహాకృతి సర్వ దేహమున యందున రాఘవ వంశ మౌళి ధ
ర్మాకృతి కూరుచున్న విధ మంతయు స్వామి ప్రతిజ్ఞ మూర్తియై"

ఈ పద్యం శిఖరాయమాణమయింది. చాలా ప్రసిద్ధమయింది. ఇందులో ప్రధానమైన పాత్రయైన సీత రూపాన్ని, మహావీరుడూ పతియైన శ్రీరామచంద్రుని వివిధ భౌతిక మానసిక గుణ కర్మలతో సంయోజన పరచి విశిష్టమైన వ్యక్తిత్వ నిర్మితి జరిగింది. అప్రతిమానంగా ఉంది. విశేషమయిన వ్యాఖ్యానాన్ని అపేక్షిస్తుంది.

ఇదీ కథలో కీలకమయిన అంశాల్ని స్పృశిస్తుంది. విరహభావమూ దాని చేత కృశీభూతమయిన ఆకృతి, శిష్ట రక్షణ కై పూనిన చాపం, లా కనుబొమలూ దయాభావంతో కళ్ళు (దృష్టి) ముఖ్యంగా భౌతికమైన చల్లని నీలమేఘం వంటి కైశికంతో శరీర సంస్థితిలో ధర్మాకృతితో కూర్చోవడంలో స్వామి ప్రతిజ్ఞారూపంతో, రూప గుణ కర్మ లక్ష్య భావనా మహితంగా సీత ఉన్న స్థితి లోకోత్తరమైన పాత్రగా రూపొందింది. ఆమె ఆకృతి పాండురమై రామచంద్రుని విరహాకృతిని తలపిస్తుంది. ఉపవాస వ్రత శోకాదుల చేత కృశించింది. పతికి దూరమై దుఃఖంలో మునిగి ఉంది. పతి స్థితి కూడా వియోగ భావమయమే. అతని పట్ల అచంచల మయిన ప్రేమతో విశ్వాసంతోనూ ఆత్మ ప్రత్యయంతోనూ విజయేచ్ఛతోనూ ఆమె ఆపూర్ణమయి ఉంది. పద్యం అలంకార మహితంగా పాత్ర స్థితికి తగిన భావ గర్భితమయిన రూపాలతో సంపన్నమయింది వరసగా కదలే దృశ్యాల్లా ఉంది. కళాత్మకమైన రచనా శిల్పంతో ఆకర్షిస్తుంది. పూర్తిగా స్వతంత్రమయిన విశ్వనాథ ముద్రను పొందింది.

'ఆశాం ప్రతిహతామివ "అన్న మూలంలోని భావం ఆధారంగా "ఆశలు సన్నగిల్లి యసితాంబుద సంతతి క్రమ్మి" అన్న పద్యం అవతరించింది. ఆశ అంటే కోరికతో పాటు దిశ అన్న అర్థమూ అన్వయిస్తుంది. దిశలు సన్నబడీ కోరికలు తగ్గిపోయి నీలిమబ్బులుక్రమ్మి అవకాశాలు తగ్గీ ఆటంకాలేర్పడీ అంతా నిరాశామయంగా ఉంది. శారదాకాశం "ఊడి పడినట్లు"గానూ ఉంది. ఆమె దైన్యంలో మునిగి ఉంది. "ఆసుర శక్తి చేత కప్పబడిన సురేంద్రుని కీర్తి" వలె ఉంది. వాల్మీకి ప్రయోగించిన ఒక ఉపమానంతో మొదలయి వరసగా స్వతంత్రమయినవి జోడించి పద్యాన్ని భావ రూపాలతో శిల్ప శాలగా మార్చడం విశ్వనాథ ప్రత్యేకత. చివరి పాదంలో



"ఆమ్నాయానామ యోగేన విద్యాం ప్రశిథిలామివ" అన్నది భావస్ఫూర్తి ననుసరించి ఇక్కడికితే బడింది "ధీ శిత దృష్టి లేక అనువదింపగబడ్డ మహాగమోక్తినాన్" అని దూర దూరం కదలిన వివరణ రూపం సీతాదేవి పరమమైన రూపాన్ని ధ్వనింప జేస్తుంది.

"మండుచున్నదాని మందసంబున దాచ నొక్క మూర్ఖ వేడి యెక్కి యెక్కి
అల్ల మందసంబె అంటుకో బోయెడు తీరు గాగ నున్న దివ్వె వోలె"

ఇది ప్రకృత సందర్భానికి తగింది. ఒక మూర్ఖుడు మండే దాన్ని పెట్టెలో దాచేస్తే అది వేడెక్కిపెట్టెను అంటుకొని కాల్చేసే దివ్వెలా సీత ఉంది. అగ్నిశిఖతో పోలిక సీత నిష్కళంక పతివ్రతాత్వాన్ని భావింప జేసే తేజోరూపం, పెట్టెలో దాచబడి పెట్టెను దహించే దీపశిఖలా అశోకవనంలో రహస్యంగా భద్రపరచినట్లుగా రావణుడు అనుకున్నది, అతని రాజ్యాన్ని దహించి వేయగలదన్న అర్థాంతర స్ఫూర్తి భవిష్యత్కథా సూచనగానూ ఉంది.

మరో గొప్ప పద్యం సీత ఉన్న దీన స్థితిని స్పందిస్తుంది
"నిత్య రామ నామ నిభృత గీతిమ తల్లి
తాన శిఖర భావ లీన యగును
ఇద్ది తంత్రి యంచు నిద్ది యష్టియంచు
నేర్పరుప రాని దగు విపంచి వోలె" ఉంది.

మూలంలో మొదటి భాగంలో "క్లిష్టరూపా మసం స్పర్శాదయుక్తా మివ వల్లకీమ్" తీగెల్ని శ్రుతి పెట్టని సరిచేయని వీణవలె నిరాదర స్థితిలో శోభాహీనంగా ఆమెస్థితి వర్ణితమయింది. ఇది కల్పవృక్షంలో అద్భుతమయిన కవితా రూపంగా పరిణమించింది. ఎల్లప్పుడూ శాశ్వతమయిన రామనామంతో నిండీ తీర్చిన గొప్పపాటగా అయింది తాను శిఖర భావంలో లీనమవుతూంది. తన్మయంలో ఇది తంత్రియనీ ఇది తంత్రిని బిగించే యష్టి అనీ గుర్తుపట్టరాకుండా ఉంది. ఇది రామనామ గీతి యనీ ఇది పాడే దేహం అనీ భేద భావం లేని ఐక్య స్థితిని పొందుతూంది. రామభావంతో నిండి ఐక్యమయిన మనో జగత్తుతో అభేద స్థితిలో ఉన్న ఆమె రూపాన్ని ఆవిష్కరిస్తుందీ పద్యం. వాల్మీకి రామాయణంలోని సత్ప్రేరణతో స్వతంత్రమయిన సృజన వ్యక్తిత్వంతో ఆవిష్కృతమయిందీ. కల్పవృక్షం. దాని కదిగా అనుభవింపదగిన తెలుగు మహా కావ్యం. మితిమీరిన తులనాత్మకత కవకాశం లేదు.

దీని ప్రత్యేకతను గురించి సమాలోచనాని కందే అంశాలు కొన్ని

(1) కథలో సందర్భాల్ని బట్టి స్థితుల్ని బట్టి నిర్మాణంలో భాగంగా చిన్నవీ పెద్దవీ సన్నివేశాల కల్పన పట్ల ఆసక్తీ

(2) మానసికమైన క్షేత్రంలో పాత్రల యోగ్యతను బట్టి సాంద్రమైన అనుభూతి గుణాన్ని స్వతంత్రంగా విస్తరించే ప్రయత్నమూ

(3) సూక్ష్మయయిన మనో విశ్లేషణతో ఉజ్వల మయిన సంవేదననూ భావోల్బణాన్ని సృజనాకృతిగా తీర్చిదిద్దే దృష్టీ

(4) ఇతర ప్రక్రియలైన నాటకం నవల కథానిక ప్రభావాలతో లోకవృత్త చిత్రణం పాత్ర వికాసం సంభాషణ సన్నివేశ కల్పనల్ని శిల్ప దృష్టితో ప్రవేశపెట్టే పద్ధతీ

(5) పలు సందర్భాల్లో కారణ సహితంగా వివేచనతో తాత్త్విక దృష్టితో వివరణమూ వాఖ్యానమూ - సాధారణీకృతం చేసే విధమూ

(6) విశిష్టమయిన తెలుగు పద్య రచనతో విశేష వృత్త వైశారద్యంతో విరాట్ స్వరూపాన్ని ప్రదర్శించే శిల్ప నైపుణితో కూడిన కళాత్మకత.

వీటి సమాకలనంతో తెలుగు భాషలో కావ్య పరిణామంలోని శిఖరాలతో వెలసిన సృజన రూపం కల్పవృక్షం, విశ్వనాథ ముద్రతో బృహదాకృతి పొందింది. దీన్ని ఉన్న విధంగా, అందులోని జీవ స్పందనల్నీ రూప దీప్తినీ భావనా ప్రపంచాన్నీ 'సహృదయ'' హృదయ వేద్యంగా అనుభవించడ మొక్కటే, న్యాయమూ అవసరమూ.



# 4. తమోనిలయం

రామాయణ కల్ప వృక్షానికి ఆధార భూమి వాల్మీకి రామాయణం. ఈ విషయంలో ఎవరికీ విప్రతిపత్తి లేదు. విశ్వనాథ తన కృతిని గురించి మాట్లాడుతూ మహర్షి మహాకావ్యానికి వ్యాఖ్యానం అనడమూ జరిగింది. సుందర కాండలో హనుమ సీతాన్వేషణకు బయుదేరి లంకలో దిగుతాడు. ఆ రాత్రి వివిధ ప్రదేశాల్ని పరిశీలిస్తూ చరిస్తాడు. ఈ మహత్కార్యంలో రాక్షసుల గృహాలూ ప్రాసాదాలూ ఉద్యాన వనాలూ వెదకుతూ ఒక చోటి నుండి మరొక చోటికి చేరతాడు. అది కుంభకర్ణుని నిలయం. మూలంలో ఆరో సర్గ పదునెనిమిదవ శ్లోకం(VI.18)లో "అథ మేఘ ప్రతీకాశం కుంభకర్ణ నివేశనమ్.........తదా పుప్లువే స మహాకపిః।'' అని ఉంది. అంతట ఆ మహాకపి ఎగిరి మేఘ సదృశ మయిన కుంభకర్ణుని నివేశనానికి చేరాడు. కల్ప కృక్షంలో "మేఘ ప్రతీకాశ''మన్న విశేషణం ప్రేరణతో ఎనిమిది పద్యాలూ ఒక చిన్న వచనంతో, స్వతంత్రమయిన వ్యక్తిత్వం కలిగిన భాగం అవతరించింది. ఇది ఏదో కేవలం వర్ణన కోసం అన్నట్లు కాకుండా అప్పటి స్థితి సందర్భం పాత్ర స్ఫూర్తితో సన్నివేశ నిర్మితి పొందింది. ఎక్కడా కుంభకర్ణుని పేరు లేదు. వివిధాంశాల సమన్వయంతో కుంభకర్ణునికి సంబంధించిన ప్రధాన మయిన లక్షణాలు దృష్టికి వస్తాయి. హనుమకూ అది కుంభ కర్ణుని నిలయమనీ తెలియదు. కవి మాటల్లోనూ నేరుగా ప్రసక్తం కాలేదు. కేవలం ప్రధాన లక్షణాల అన్వయంతో భాసింపజేయడం కథన శిల్పం. సీత ఎక్కడ ఉన్నదో తెలుసుకోవడమే హనుమ ప్రధాన లక్ష్యం.

నివేశనం వర్ణనంతో ఖండిక ఆరంభమవుతుంది. ఇది సాంద్రమయిన భావ రూపాల వరసతో తమోగుణ ప్రధాన లక్షణాన్ని భావింపజేస్తూంది. ఒక మహా భుజంగకము చుట్టలుచుట్టలుగా నిర్మోకాన్ని తిగిచినట్లుంది. అంజనాచలం సౌధాకారంగా చెక్కినట్లుంది. శుక్ల పక్షంచేత కృష్ణ పక్షం విసరబడి ఇచ్చట ముడుచుకొన్నట్లుంది. నిద్రామహాదేవి నీలవర్ణం కలిగి నీరంధ్రమయిన నిష్కుటాన్ని నిర్మించుకున్నట్లుంది. దీని ముందు వెన్నెలలు ప్రకాశాన్ని కోల్పోతున్నాయి. భయం కలిగించే విధంగా ఉందీ ఉన్నతమైన సౌధం. సూర్యుని శిష్యుడయిన హనుమ కది జలజ బంధువు అయిన సూర్యుని కెదురుగా అడ్డుగా పెరిగే వింధ్య పర్వతంలా ఉంది. ఈ ఉపమానంలో సూర్యుని ప్రసక్తి తమస్సుకు వ్యతిరేకంగా హనుమలో సత్త్వ కిరణ గుణ తేజః ప్రసారాన్ని భావింపజేస్తూంది "పరమ లఘు లంఘన''లతో

హనుమ మును ముందుకు వెళ్ళుతూ అగస్త్య భావనతో భవనం నేల మట్టంగా పరచబడి నట్లనిపించే మనోరూపం పేర్కోదగింది. ప్రస్తుత స్థితిలో అసాధ్యమైన దాన్ని అధిగమించే శక్తి రూపాన్ని తలపుకు తెస్తుంది. భౌతికేతరమయిన రూపాన్ని ప్రకాశింపజేస్తుంది. హనుమ "సత్పథ విహారి!" ఈ విశేషణం ఆలోచనా రమణీయమైంది సీత "సత్"కు దగ్గర అయింది, మానుషాకృతిలో ఉంది. అతని "మనీష" సీతను వెదకడంలో నిమగ్నమయింది.

ఆ సమయంలో "ఆలో అర్థ నిమీలితాక్షులయి నిర్వ్యాపారులయి"యొక్క నిద్రాలోకంబున నూగు చున్నటుల" కొందరు దైత్యులు సగం మూతబడిన కళ్ళతో ఏ పనీలేకుండానూ నిద్రాలోకంలో ఊగుతూన్నట్లుగానూ తాగిన మత్తులో ఏదో ప్రలపిస్తూ ఉన్న వారు! వేరొక శ్రేణికి చెందినవారు అక్కడ ఉన్నారు. ఆ స్థలం విశ్శబ్దం అలసభావం నిష్క్రియతో ఒక విధంగా కనిపించింది. ఏదో తిత్తులు ఊదినట్లుగా మహారవం ప్రతిధ్వనిస్తుంది. అయినప్పటికీ ఎవరూ పట్టించుకునేట్టు లేదు. ఈ స్థితి అలవాటుగానూ సహజమైందిగానూ అనివార్యమయింది గానూ ఉన్నట్లుంది. దైత్య వాతావరణంలో భటులు ఆయుధాలతో అగ్నిగోళ నయనాలతో మౌన భావ ముఖాలతో నియమ వర్తనంతో చరిస్తున్నారు. మరో శ్రేణికి చెందినవారు ఇదొక విధం.

"అది ఏదో ఒక నిద్ర మేలుకొనగా నైనన్ జగన్మారణో
న్మద రేఖా జటిలంబుగా కనబడున్ క్ష్మాజాత యెందున్నదో
అది ఆ లోపుననే ఎరుంగ వలె దైత్యం బైన మాయా మహా
స్పద మన్నట్లుగ నున్నదీ నిదుర తద్భావం బనిర్వాచ్యమై"

కనిపిస్తుంది. అదొక మహా నిద్రారూపం. దాని నుండి మేలుకొన్న శక్తిలో జగత్తును నాశనం చేసే ఉన్మాదరూపం ఆలోచన కందుతూంది. సీత ఎక్కడ ఉందో తెలుసుకోవాలనే హనుమంతుని ఆరాటం. ఇది ఏదో మాయా నిలయంలా ఉంది. నిప్పులతో కుత కుతలాడే "అగ్ని పర్వత మన నున్నదీ గృహము" ఎప్పుడు హఠాత్తుగా పగిలి భగ్గున మండి పై కెగసి పడే అగ్నిధారలతో సర్వమూ బూది చేసే ప్రమాదమూ ఉంది. ఈ రచనలో అచట కనిపించే నిద్రా జడ రూపం దైత్య తమో గుణంతో లోపల నున్న శక్తి మేల్కొనీ బయటపడీ భయంకరమయిన విషమ పరిణామాలకు దారితీసే భావన కుంభకర్ణుని మూలభూతమయిన వ్యక్తిత్వాన్ని ఉన్మీలితం చేస్తూంది. ఈ భాగం ఎనిమిది పద్యాలూ ఒక వచనంతో ఉంది. దైత్య భావంతో కూడిన తమోనిలయాన్ని భావింపజేస్తూంది.



ఇందులో ప్రస్తుత స్థితి సమీక్షతో తన లక్ష్యానికి పనికి రాని దాన్ని గుర్తించడం ఆ చోటును పరిహరించే నిశ్చయానికి రావడం జరిగింది. ఇంతటి ఇంద్రియ జ్ఞానం మాలిన నిద్రాభావానికీ, నిత్యమూ జాగ్రదవస్థలో ఉండే చైతన్య శక్తి జానకీ దేవికీ సంబంధం లేదని నిర్ణయం జరిగింది. ఆ చోటును పరిహరించి మరో చోటికి వెళ్ళడంలో ఆలోచనా రూపం హనుమంతుని వివేచనా శక్తికి గుర్తు. కారణసహితంగా ఒక నిర్ణయానికి రావడం పరిణత మనస్కులకే సాధ్యం.

వాల్మీకంలోని ఒకే ఒక "మేఘ ప్రతీకాశ" మన్న విశేషణం ప్రేరణగా కుంభకర్ణుని నివేశనం కవిత్వ రామణీయకతతో తాత్త్విక గభీరతతో రూపొందింది. పాత్రకు సరిపోయిన కల్పనతో రచనా శిల్ప సౌందర్యంతో ఆకర్షిస్తుంది. కల్పనలో భావరూపాల కలనంతో కుంభకర్ణుని పేరు చెప్పకుండా దైత్యభావ పూర్ణంగా వాతావరణం చిత్రించడంతో సన్నివేశం ఆలోచనా రమణీయమవుతూంది. ఇది భౌతిక మానసిక ఆత్మ భూమికల్ని పొందింది. (1) దైత్యుని ఇంద్రియ జ్ఞానం లేని జడ స్థితి భౌతిక రూపాన్నీ 2) తత్కాలంలో (2) అన్వేషణలో వివేచనమూ నిశ్చయమూ హనుమలో మనోరూపాన్నీ (3) నిత్య చైతన్యశీలి యైన సీతా ప్రసక్తితో ఆత్మరూపాన్నీ కలిగింది. కవితాసౌందర్యంతో తాత్త్విక స్పర్శతో సృజన రూపం విశ్వనాథ వ్యక్తిత్వాన్ని ప్రకాశింప జేస్తూంది.

h h h

# 5. ఆత్మ శిఖ

మహర్షి రామాయణం సుందరకాండలో హనుమంతుడు సీతాన్వేషణంలో విభీషణుని నివేశనం చేరతాడు. వాల్మీకంలో "మేఘ ప్రతీకాకం" అన్న విశేషణం కలిగిన కుంభకర్ణుని నివేశనంతో పాటు "విభీషణస్యచ" (సర్గ VI శ్లో 18) అని విభీషణుని నిలయం కూడా చేర్చబడింది. కల్పవృక్షంలో విభీషణ శబ్ద సహాయంతో హనుమ ఆ నివేశనాన్ని చూచి ప్రవేశించిన భాగం తొమ్మిది పద్యాలు ఒక చిన్న వచనంతో కూడిన స్వతంత్రమైన రూపాన్ని పొందింది. విభీషణ శబ్దంలోని భావ ప్రసార క్షేత్రంతో పాటు పాత్ర వ్యక్తిత్వ ప్రకాశనమూ భౌతికాభౌతిక స్థాయిల్లో చిత్రితమయింది. మేఘ సదృశమయిన కుంభకర్ణుని నివేశన వాతావరణ చిత్రణం తామస ప్రవృత్తి ప్రధానంగా ఉంటే విభీషణుని నివాస వాతావరణం సాత్త్విక ప్రవృత్తి ప్రముఖంగా ప్రతీకాత్మను పొందింది. రెండూ భిన్నమయినవీ. పరస్పరమూ విరుద్ధమయినవీ.

ఈ సందర్భంలో భీషణం అంటే భయంకరం అనీ రాక్షసులు భయాన్ని కలిగించే వారూ లోపల భయ భావంతో దుష్కృత్యాలకు తలపడే వారూ భీషణులు. విభీషణుడంటే విశేషంగా అంటే ఎక్కువగా ప్రత్యేకంగా భయాన్ని కలిగించే వాడని కావచ్చు కాని కథా పరిణామంలో విభీషణుడు దీనికి భిన్నమైన వ్యక్తిగా కనిపిస్తాడు. ఏ ఉద్దేశంతో మొదట్లో ఏ పేరుపెట్టినా అతని ప్రవర్తనలో సార్థకమయిందీ, "విగతః భీషణః యస్యసః" విగతమయిన అదృశ్యమయిన భీషణ భావంతో సాత్త్విక లక్షణంచేత విభీషణుడన్న పేరు అన్వర్థమవుతూంది. ఇలా ఎందుకు పేర్కొబడింది? అంటే, రాక్షసులు భయంకరమైన తమో లక్షణం కలవారు. వాళ్ళకు చెందిన సమూహంలో ఈ వ్యక్తిలో దీనికి భిన్నంగా తమోగుణం నుండి ముక్తమయిన మనో రూపాన్ని సూచించేందుకూ ఇలాంటి పేరు అవసరమవుతుంది. దీని వివరణం కల్పవృక్షంలో సుందర మయిన కవితా రూపాన్ని పొందింది. స్వతంత్రమయిన భాగంగాను సమాలోచనకందుతుంది. భయం అంటే ధైర్యం చెదరిన మనోరూపం. ఇది మానసికమైన వికార స్థితినీ కలిగింది. విభీషణు డంటే చెదరని ధైర్యంతో మానసికంగా సమ స్థితిని పొందిన వాడని అర్థం. ఇదీ పాత్రకు సముచితంగా అన్వయిస్తుంది. విశ్వనాథ రచనలో ఈ దృష్టి కీలకమైందీ, దీనిపై ప్రకాశరూపమూ అవగతికి వస్తుంది. ఆరంభంలో



"కంబు వళక్ష కాంతి యయి క్రమ సుదర్శన భావ మొప్ప పీ
తాంబర చంద్రికా ధవళితాత్మ శిఖా కమనీయ శృంగమై
అంబుజ పత్ర చారు వివిధాలయ కోణము లొప్పగా నిరా
డంబర మైన శాంత ప్రకట స్ఫుట సౌధమొకండు చూచుచున్"

ఏ ఆడంబరం లేని శాంతమయమైన సౌధం కనిపించింది. శంఖంలా చూడడానికెంతో చక్కగా ఉందీ. కంటికి ప్రియంగా ఉందీ. ఇందులో శంఖమూ సుదర్శనమూ విష్ణు భావ సూచకంగా దృష్టికి వస్తాయి. పట్టు వెన్నెలల్లో "ఆత్మ శిఖ" వలె "కమనీయ శృంగం"తో, పద్మం యొక్క అందమయిన రేకుల్లా వివిధాలయ కోణాలతో కళాత్మకంగా ఉందీ. పటాటోపం లేకుండా ఉంది. "శాంతి"మయ భావాన్ని స్ఫుటంగా ప్రకటిస్తూంది. 'ఆత్మ' భావంతో తాత్త్విక స్పర్శనూ పొందుతూంది. సాత్త్విక గుణంతో హ్లాదమయిన నిర్మాణ విధంతో నిలయం భౌతిక స్థాయి నుండి భౌతికేతర స్థాయిలో ప్రవేశపెడుతూంది. చేతుల్లో బల్లేలతో "మంకెన"చూపులతో కోరల ముఖాలతో భటులు సంచరించడం లేదు. సంపద మరియు వినయం కలిగిన సాధు రూపం గోచరించింది. కన్నుల పండువుగా ప్రసన్నంగా ఉంది. ఇది హనుమ ఇంతకు ముందు చూచిన కుంభకర్ణుని నివాస స్థితికి భిన్నంగా ఉంది. ఈ విశేష స్థితిని కవి ఉత్తమ సంస్కార సంపుటి చేతనూ విశ్వాస మార్గం చేతనూ, ఒక జీవి ఆత్మ లక్షణం" మూర్తిలో ముఖంలో వేషంలో కట్టిన ఇంటిలో రూపాన్ని బట్టి స్ఫుటమవుతుందన్న నిర్ణయం చేయబడింది. ఇది సాధారణీకృతమయింది. ఆలోచింపజేస్తూంది.

ఈ సౌధం ఎవరిదో తెలియదు, కవి పేర్కొలేదు. దాన్ని సమీపించే హనుమకూ తెలియదు కథన శిల్పం ఇక్కడ సంశయభావ కోణంలో వెలసింది ఉత్సుకతను నిలిపే దృష్టితో సాగింది. అయితే ఇది మధురమయిన ప్రకృతితో ఉత్తమ సంబంధాన్ని దీపింపజేస్తూంది. ఆర్ద్రమయిన భక్తి భావాన్ని తలపిస్తూంది. రాక్షసుల ఇళ్ళు ఇలాంటి భావనను కలిగించవని హనుమ అభిప్రాయం. ఇక్కడ తద్భిన్నంగా ఆంతరమయిన "ఆత్మ శిఖా" దీప్తి అనుభవంలోకి రావడం విశేష స్థితిలో మనస్తత్వ ప్రకాశ పరమయిన వ్యాఖ్యానం అనవచ్చు. హేతువు దృశ్యమానం కాదు. దీనికి పరోక్ష గవేషణం అవసరం. ఈ నివాసాన్ని చూస్తూంటే రెండు కళ్ళకూ "వెన్నెల తీవె తోటలా" సంతోషింప జేస్తూంది. వెన్నెల వచ్చేది రాత్రి వేళనే, రాక్షసులు రాత్రించరులు. రాత్రివేళ సంచరిస్తారు. రాత్రి వేళ వెన్నెల సాత్త్వికమైన రూపానికి ఆలంబనవుతూంది. విశేషమైన భావానికి

ఆస్కారమవుతూంది. ఈ విధంగా పోలిక ఔచిత్యాన్ని పొందుతూంది. మనసులో శాంతి ప్రసారాను భవం "సత్పథ విహారి" అయిన మహా కపికి మానసికంగా సీతా గవేషణంలో ఎంతో ఉపకరిస్తూంది. మిక్కిలి దుష్టమయిన జాతిలోను ఒక్కొకపుడు ఎంతో "సాధుశీలి" జన్మించడం జరుగుతుంది. ఈ జీవ సంచారం చాలా చిత్రమయిందనీ హనుమంతుని ఆలోచన! ఈ సాధు భావ నిలయంలో సీతను వెదక వలసిన అవసరం లేదనుకున్నాడు. ఇక్కడ సీత ఉండే ఏ అవకాశమూ లేదు. సాధులోక శ్రేష్ఠుడయిన హనుమకు "సాధుజన" నివాసాన్ని దర్శించాలనే కోరిక కలిగింది.

ఈ ఆలోచన ఉత్త సంస్కార సంపుటిలో బ్రతికే జీవ భావానికి నిదర్శనంగా ఉంది. లోపలికి వెళ్ళి చూస్తే 'కొడి లేని ఆముదపు దీపాల వెలుగులు "నిశాదేవి" ఇంపయిన కురుల్ని స్పృశించే, ఆదేవి జడలో పూల తళుకుల్లా ఉన్నాయి. అది నిశాసమయం, భయం కలిగే బదులు ఆ నివాసంలో శాంత సుందరంగా నిశ ఒక దేవిగా అని పించడం లోకోత్కృష్ట మయిన భావన. మహాశక్తి రూపం వైపు మరలిస్తూంది. అక్కడి స్థితి హ్లాదంగానూ అందంగానూ ఉంది. మనస్తత్వ పరమయిన దర్శన రూపంతో నిస్సందేహంగా గొప్ప రచనలో పై పై మెట్టుకు తీసుకుని వెళ్ళే అనుభవ పారమ్యం కలిగిందీ భాగం. శాంత హోమాల యజ్ఞ శాలలు కన్పించాయి. సౌధ విభాగాల్ని "చూచినట్లే" చూచి ఆలస్యం చేయకుండా, సీతాన్వేషణలో మరో చోటికి వెళ్ళాడు.

ఈ సన్నివేశంలో 1) ప్రసన్నమయిన భౌతిక వాతావరణం 2) సాత్త్విక మనో రూపాన్ని భావింపజేసే అనుభవ రూపం 3) ఉత్తమమైన జీవరూపంతో ప్రకాశించే ఆత్మశిఖరం సమాకలితమయినాయి. ఈ భాగం కవితా సౌందర్య కళతో తాత్త్విక భూమికతో స్వతంత్రమైన విశ్వనాథ సృజన యశోరూపాన్ని భావింప జేస్తూంది.

h h h



# 6. వర్ణనా విభవం

వాల్మీకి రామాయణంలో వర్ణన కున్న ప్రాధాన్యం దాని ప్రశస్తి జగద్విత మయింది. ఇది కాళిదాసుకూ మార్గదర్శకమయింది. సుందర కాండలో రెండు చోట్ల చంద్ర వర్ణనం చేయబడింది. మనోహర మయిన భావ రూపాలతో అభివ్యక్తి సౌందర్యంతో ఆకర్షణీయమైన శక్తి కలిగినవి. శాశ్వతంగా నిలిచాయి. మొదటిది రెండో సర్గలో ఉంది. హనుమంతుడు త్రి కూట పర్వత శిఖరం పయి ఉన్న లంకా నగరాన్ని సూక్ష్మ రూపంలో ప్రవేశించాడు. చంద్రోదయంతో అన్వేషణకుపక్రమించాడు. హనుమ లంకా నగర ప్రవేశానికి శుభారంభంలా ఉంది. సీతా దర్శన ఘట్టంలో సమయం రామ కార్యానికి ఆనుకూల్యాన్ని సూచిస్తూంది. హనుమంతునికి తాను పడిన శ్రమను మరపించే వెన్నెల వాతావరణం హృద్యమైందీ. రెండోది ఐదో సర్గలో ఉంది. సీతాన్వేషణలో హనుమ రావణుని అంతఃపురంలోకి ప్రవేశించే ముందు చంద్ర వర్ణనం చేయబడింది. ఆవేళ అంతటా చూడవలసిన అవసరం దృష్ట్యా ప్రాముఖ్యం వహిస్తూంది. మహర్షి రచనా ప్రణాళికలో సీతాన్వేషణంలో చంద్రవర్ణనం ఉన్న స్థానాలివి. వాటి  కథా గమనం హనుమ పాత్రపై ప్రభావ దృష్టితో శిల్ప సుందరమైనవీ, మహనీయమైనవీ.

కల్ప వృక్షంలో రచనా ప్రణాళిక కొంచెం మారింది. మొదటిది పూర్వరాత్ర ఖండంలో హనుమంతుడు రావణుని అంతఃపురంలోకి ప్రవేశించే ముందు చంద్ర వర్ణనం చేయబడింది. రెండోది సీతను వెదకి పుష్పకం నుండి బయటికి వచ్చి చింతాక్రాంతుడయిన స్థితిలో వైరాగ్య భావనతో తపస్సున కుపక్రమించే సందర్భంలో ఉంది. వాల్మీకి రామాయణంలో చంద్ర వర్ణనం హనుమకు ప్రేరణగా ఉంది. కల్పవృక్షంలో స్థూలంగా  హనుమపై చంద్ర వర్ణనా ప్రభావాన్ని మానసికంగా గుర్తించడమూ జరిగింది. అయితే ఎక్కువగా స్వతంత్రమయిన కవితా రూపాన్ని కలిగింది. ఒకటి రెండు చోట్ల వాల్మీకంలోని భావాలకు వివృతి కనిపిస్తుంది. సృజన విషయంలో రచనలో భాషా భేదం తెలుగు కావ్యపరంపరా మార్గం కవి వ్యక్తిత్వం మొదలయినవి పురస్కరించుకొని దేని ప్రత్యేకత దానిదే అన్నట్లు సహృదయుల అనుభవంలో నిలుస్తాయి.

## II

అఖండ మయిన సంపదకూ భోగాలకూ నిలయంగా రావణ పాలితమయిన లంకా నగరం చిరమైన యశోరూపాన్ని పొందింది. హనుమ సూర్యాస్తమయం వరకూ వేచి ఉండి చంద్రోదయంతో రామ కార్యంలో అన్వేషణ కుపక్రమించాడు.

"చంద్రోపి సాచివ్య మివాస్య కుర్వన్
తారా గణైర్మధ్య గతో విరాజన్
జ్యోత్స్నా వితానేన వితత్య లోకమ్
ఉత్తిష్ఠతే నైక సహస్ర రశ్మిభిః

నగరం గురించి హనుమంతుని కేమీ తెలియదు. అందువల్ల అతని కుపకరించే విధంగా వర్ణనా సంవిధానం సమయోచితంగా ఉంది. ఉదయించే చంద్రుడు హనుమంతునికి సాచివ్యం చేస్తున్నట్లుగా ఉంది. సీతాన్వేషణకు సహాయ పడుతున్నాడు. నక్షత్ర గణాల మధ్య ప్రకాశిస్తూ వేల వెన్నెల కిరణాల ప్రసారంతో విస్తరించాడు. వెన్నెల ప్రకాశంతో పాటు చుక్కల కాంతి రెండూ కలిసి సాంద్రమైన వెలుగు హ్లాద కరంగా ఉపయోగకరంగా ఉంది. వెన్నెల మేలు కట్టు (చాందిని)తో వెలుగుకు సాంద్రత ఏర్పడుతూంది. దీని వల్ల ప్రసరించే వెలుగు విస్తీర్ణత తగ్గుతుంది. వెతికే వస్తువును సులభంగా గుర్తించేందుకు వీలుగా వెలుగు ఎక్కువవుతుంది. హనుమ నగరాన్ని చక్కగా చూచే వెదకే అవకాశం లభిస్తుంది. ప్రకృతిలో భాగమయిన చంద్ర వర్ణనం కథాగతికి పోషకంగా ఉంది. పాత్రలో ఉన్న హనుమ పయి మానసికంగా శాంతమయిన ప్రభావాన్ని నెరపుతూంది.

"శంఖ ప్రభం క్షీర మృణాళ వర్ణమ్ ఉద్గచ్ఛ మానం వ్యవభాస మానమ్
దదర్శ చంద్రం స హరి ప్రవీరః పో ప్లూయ మానం సరసీవ హంసమ్"

చంద్రుడు పైకి ఉద్గమిస్తున్నాడు. తెల్లని శంఖ కాంతితోనూ క్షీరమూ మరియు తామర తూడు శోభ తోనూ ప్రకాశిస్తున్నాడు. ఇంకా సరస్సులో పైన తేలుతూ ఈదుతూన్న హంస వలె ప్రకాశిస్తూ ఉన్నాడు. ఈ రూపంలో వానర వీరుడు చంద్రుని (దదర్శ) చూచాడు. హనుమకు సహాయపడే చంద్రుని లక్షణాలు ఉత్తమ మయిన వస్తువులతో పోల్చబడినాయి. ఉత్తముల గుణ సంపద సమయానికి ఆపన్నులకు సహాయపడడానికే! "ఆపన్నార్తి ప్రశమన ఫలాః సంపదోహ్యుత్తమానామ్" అన్న సూక్తి చక్కగా అన్వయిస్తూంది. అద్భుతమూ అవిదితమూ అయిన నగరాన్ని వెదకడం ఎట్లా? అన్న విచారంతో ఉన్న హనుమంతుడు చంద్రోదయ ప్రకాశంతో "హృష్టశ్చ వైదేహ్యా దర్శనోత్సుకః" వైదేహిని దర్శించే అభిలాష పెరిగినవాడై సంతోషాన్ని పొందాడు. ఇదీ శుభ పరిణామమే. భౌతికంగా కంటికి దారినీ వస్తువుల్నీ చూపడం, మానసికంగా



ఉత్సాహాన్ని కలిగించడం రామ కార్య సిద్ధికి దోహదం చేస్తున్నాయి. శంఖం విష్ణువు ధరించేదీ. శుభాపాదక మయిందీ. క్షీర (సాగరం)ం విష్ణు నిలయాన్ని భావింప జేస్తుంది. పవిత్రతా రూపాన్ని పొందింది. మృణాళం సరస్వతి వాహన మయిన హంసకు ఆహార మయిందీ. కోమలమూ రస మయమూ అయింది. ప్రకృతి రూపమయిన చంద్రుణ్ణి రూప గుణ మర్యాదోపపన్నంగా తీర్చి అతని ప్రభా ప్రభావంతో లంకా నగర ప్రవేశం హనుమకు శుభోదర్కమవుతూంది. మహర్షి కళాత్మకతనూ భావింపజేస్తూంది.

## III

కల్ప వృక్షంలో మొదటి దానికి చెందిన భాగం, రావణుని అంతఃపురంలోకి ప్రవేశించే సందర్భంలో ఉండడంతో పాటు వర్ణనమూ స్వతంత్రమైనదిగా నిర్వహణ రూపాన్ని పొందింది. "వెండి చాయల తళుకారు నీళ్ళుల వియత్కమలాకర రాజహంసమో" యనేట్లుగా చంద్రుని రూపం భావితమయింది. ఈ వర్ణనం వాల్మీకంలో ఒక్కొక్కవిధంగా అలంకృతమయింది. కవి ప్రత్యేకత "చెలగె (నడి)మింట కలువ పూచెలిమి కాడు" అన్న మకుటంతో ఇరవై ఆట వెలది గీత పద్యాల్లో విస్తృతిని పొందింది. ఈ పద్ధతిలో ఒక శతకాన్ని పూర్తి చేయగల సామర్థ్యమూ సాహసమూ ఉన్న మహా కవి, తన స్వతంత్రమయిన ఆవేశ వేగాన్ని అదుపులో పెట్టుకోవడమూ ఔచిత్య భావనా మతులకు సంతోషాన్ని కలిగిస్తూంది. ఈ పద్యాల్లో కొన్ని పౌరాణికంగానూ కొన్ని కాల్పనికంగానూ కొన్ని కథతో ఎంతో కొంత సంబంధం కలిగినవిగానూ దృష్టికి వస్తాయి.

"అప్సరో రత్నమును రావణాపనీత
రంభ వెదకంగ నలకూబర ప్రణిధియు
తెగువయై స్పష్ట మూర్తి యే తెంచె ననగ
చెలగె నడి మింట కలువపూ చెలిమి కాడు"

రావణుడెత్తుకొని పోయిన రంభను వెదకడానికి నలకూబరుని చారుడు సాహసం చేసి వెల్లడిగా వచ్చినట్లు చంద్రుడు ప్రకాశించాడు. హనుమంతుడు సీతను వెదకేందుకు వచ్చిన స్థితిని బింబించే పౌరాణిక కథా ప్రసక్తి హనుమంతుని పనికి ప్రేరణ రూపంగా కవి దృష్టిని భావించవచ్చు.

"బహుళ రాజ నీతి పరముండు" రాముడు, తాను హనుమను పంపి అతని "చర్య యెట్టు లెట్టు లుండు" వీక్షించు నన్నట్లు "కలువ పూ చెలిమికాడు" ప్రకాశించాడు. హనుమ సీతను వెదకడానికెవరో దీపాన్ని తెచ్చారనేట్లుగానూ, చల్ల చేసి రాత్రి చల్లపై చెదరిన చిన్న వెన్నలు చుక్కలై, విడిచిన చిన్న ముద్ద చంద్రుడైనట్లు భావ రూపాలు ఒక దాని తరువాత మరొకటి కదలాయి. లంకలో ఉన్న సీత వదనం ఆకాశం సరస్సులో ప్రతి ఫలించిందనట్లుగా చంద్రుడు ప్రకాశించాడు. హనుమ సీతను గుర్తు పట్టేందుకు మంచి సూచనగా ఉందీ భావం.

"ఇదియు రుద్రమూర్తి" ఎనిమిది తనువులైనట్టి అగ్నులలో అష్టమాగ్ని" - అన్న భావన హనుమంతుడు శివాంశయైన రుద్ర భావంతో అగ్ని తత్త్వం కలిగిన శక్తి రూపానికి సమాంతరంగా దివ్యమయిన ఆలోచనకు అవకాశాన్నిస్తూంది. ఆత్మ గోపనంతో జరగవలసిన అన్వేషణాన్ని ప్రబోధిస్తూంది.

ఈ వర్ణనంలో భౌతిక మయిన ప్రకృతి గతమయిన అంశాలతోపాటు భౌతికేతర మయిన అంశం సూచనగానూ వివేచన కందుతుంది. ఇది రెండో భాగంలో (వర్ణనా దీప్తిలో) పరిణతా కృతిని పొందింది.

తెలుగు పలుకులతో కూడిన మకుటంతో చంద్ర వర్ణనం హ్లాద గుణంతోపాటు ఆలోచనా రూపాన్నీ ప్రతిఫలిస్తూంది. విశ్వనాథ స్వతంత్రమయిన వర్ణనా విభవానికి ఉదాహరణీయ మవుతూంది.

h h h



# 7. వర్ణనా దీప్తి

## I

వాల్మీకి రామాయణంలో రెండో చంద్ర వర్ణనం ఐదో సర్గలో హనుమంతుడు రావణుని అంతః పురంలోకి ప్రవేశించే సందర్భంలో చేయబడింది. ఇది ఎనిమిది శ్లోకాల్లో కవితా రామణీయకతను పొందింది. రామాయణ కల్పవృక్షం రెండో వర్ణనం స్థలమూ సందర్భమూ మారింది.

"తతస్స మధ్యంగత మంశు మంతమ్ జ్యోత్స్నా వితానం మహదుద్వహంతమ్
దదర్శ ధీమాన్ దివి భాను మంతమ్ గోష్ఠే వృషం మత్త మివ భ్రమంతమ్"

అంతట ధీమంతుడు హనుమంతుడు ఆకాశంలో పై నుండి వెన్నెలలు చిమ్ముతూ, గోష్ఠంలో తిరిగే వృషభం వలె ఉన్న చంద్రుణ్ణి చూచాడు. భారతీయ వ్యవసాయ జీవన సంస్కృతిలో వృషభానికి గల ప్రాధాన్యంతో కవి కల్పనలో స్థానాన్ని పొందింది. వృషమంటే ధర్మమనే అర్థంలోనూ భావ విస్తృతి కవకాశాన్ని ఇస్తూంది.

"లోకస్య పాపాని వినాశయన్తమ్ మహో దధిం చాపి సమేధ యన్తమ్
భూతాని సర్వాణి విరాజయన్తమ్ దదర్శ శీతాంశు సుధాభి యాన్తమ్"

తన రాకతో లోకాల పాపాల్ని రూపు మాపే, సముద్రాన్ని (ఉప్పొంగ జేసే) వృద్ధి పరచే, సర్వ ప్రాణుల్నీ విరాజిల్ల జేసే చల్లని కిరణాలతో పైకి వచ్చే చంద్రుణ్ణి చూచాడు దివికి చెందిన ప్రకృతి దేవతల్లో హ్లాద కరుడు చంద్రుడు. భూమి పై అతని ప్రభావం ప్రకీర్తిత మయింది. విశ్వ స్థాయిలో రెండిటి అనుబంధాన్ని సూచిస్తూంది. మనస్సును హ్లాద మయం చేస్తూ కార్యాచరణకు సిద్ధ పరుస్తూంది. రామ కార్యం పట్ల ఉత్సాహ శక్తిని వృద్ధి పరుస్తూంది. మనస్సును పవిత్ర మయిన పుణ్యభావ దిశలో వర్తింప జేసే ఆలోచన కవకాశమిస్తూంది.

"హంసో యథా రాజత పంజరస్థః సింహో యథా మందర కందరస్థః
వీరో యథా గర్విత కుంజరస్థః చంద్రో2పి బభ్రాజ తథాంబరస్థః"

వెండి పంజరంలో హంసవలె, మందర పర్వతం గుహలో సింహం వలె, మద గజం పయి వీరుని వలె గగనంలో చంద్రుడు ప్రకాశించాడు. గగనంలో మబ్బుల

దూర సామీప్యాల్ని బట్టి చలనంలో దృశ్యాన్ని బట్టి వివిధ భావ రూపాలు ఏర్పడినాయి. సీతాన్వేషణకు అవసరమైన ప్రసన్నత సాహసం ఉత్సాహం తో హనుమ మనోగగనంలో ఈ వర్ణనం సార్థకతను పొందుతూంది.

"శిలా తలం ప్రాప్య యథా మృగేంద్రో మహా రణం ప్రాప్య యథా గజేంద్రః
రాజ్యం సమాసాద్య యథా నరేంద్రః తథా ప్రకాశో విరరాజ చంద్రః"

శిలా తలంపై చేరిన మృగేంద్రం వలె, మహారణంలో ప్రవేశించిన గజేంద్రం వలె, రాజ్యాన్ని పొందిన నరేంద్రునివలె చంద్రుడు ప్రకాశంతో విరాజిల్లాడు. పై వర్ణనకూ దీనికే భేదం ఉంది. రచనారీతిలో ఒకటిగా కన్పిస్తాయి. భావ యోజనంలో ఒకటిగా కన్పిస్తాయి. కాని ప్రాప్య, ఆసాద్య అన్న క్త్వార్థాలతో (అసమాపక క్రియలతో) చేయబోయే కార్యం యొక్క సాఫల్యాన్ని ఉత్తమమైన ఉన్నతమైన హితకరమయిన లక్షణాలు గల ఉపమానాలతో సూచితమవుతుంది. ఇంద్ర శబ్దం శ్రేష్ఠ వాచకమై మూడింటిలోని ఆయా లక్షణాలకు గరిమను ప్రాభవాన్నీ ప్రశస్తినీ భావింపజేస్తూంది. హనుమంతుని మనస్సు ఉపక్రమించే కార్య స్వరూపానికి సంకేతంగా ఉందీ శ్లోక పరంపర. ఇంకా ప్రణయ కలహాలు వీడి స్త్రీ పురుషులన్యోన్య రాగ యుక్తులైనారు. ఈ వర్ణనల్నీ ఆకాశంలో చంద్రుడు పైకి వచ్చే సమయంలో గతి వైఖరిని బట్టి ప్రభావాన్ని నెరపుతున్నాయి. ఈ విధమైన భావనా క్రియ సృజన శక్తి ప్రసారంలో జరిగేది. ఈ విధంగా తరువాత వచ్చిన కవులకు మార్గదర్శకమయింది. వాల్మీకంలో హనుమంతునికి "సాచివ్యం" చేసే భావ రూపాలు "గుప్త కళ"తో యోజితమయినాయి. వాల్మీకి రామాయణంలో చంద్ర వర్ణనం ఆ తరువాత వచ్చిన కావ్య ప్రపంచంలో ఆదర్శ రూపంగా నిలిచింది. తెలుగు కావ్యాలలోను ప్రవేశించింది. కావ్య జగత్తులో స్థిర పడింది.

## II

రామాయణ కల్పవృక్షంలో సుందరకాండ పూర్వరాత్ర ఖండంలో హనుమ సీతాన్వేషణంలో రావణాంతఃపురంలో సీత కనిపించనందుకు విషాద ముద్రితుడవుతాడు. లంకా పట్టణ ప్రాకారాన్ని అధిరోహిస్తాడు. ఇందులో సన్నివేశం మూలానికి భిన్నంగా రూపొందింది. ఎదురుగా మహా సముద్రం! దాని హోరు, వీచే



చల్లని గాలీ, పైన చుక్కలూ చంద్రుడూ! ఈ చంద్ర వర్ణనంలో ఆ స్థలం చుట్టూ ఉన్న వాతావరణమూ హనుమ మానసిక స్థితీ తెలుగులో వేరుగా ఉన్నాయి.

సీత కనిపించలేదు. హనుమ ఆలోచనలో దిగుతాడు తిరిగి వెనక్కి వెళ్ళడమా? అపుడు శ్రీరాముడేమవుతాడు? లక్ష్మణుడేమవుతాడు? అయోధ్యా జనం ఏమవుతారు? పైగా "ఆ సుగ్రీవుడు చండ శాసనుడు" మెడకు తాడు చుట్టి చెట్టు కొమ్మకు వ్రేలాడదీస్తాడు. ఇంకా సముద్రం అవతలి ఒడ్డున కపులు నిరీక్షిస్తూ ఉంటారు. "ప్రశ్న ప్రౌఢ చండానను"లవుతారు. ప్రశ్నల పరంపరతో ఉక్కిరి బిక్కిరి చేస్తారు. తానేదో ఘన కార్యం చేయ గల సమర్థత ఉందనీ వారనుకున్నారు. ఇపుడు అది అభినయ మనుకుంటారు. అగ్నిలో ప్రవేశించడ మొకటే మార్గమని తలుస్తాడు. అయితే తపస్సు చేయడం అగ్నిలో ప్రవేశించడం వంటిదే. ఈ విధంగా తపస్సు చేసుకొంటూ అక్కడే ఉండి పోవడానికి నిర్ణయించుకుంటాడు. ఆ సమయంలో పైకి చూస్తే చంద్రుడు చిత్ర చిత్రమైన భావ రూపాలతో దర్శిస్తాడు. ఇది మనః ప్రభావకరంగా కళాత్మకతను పొందింది.

ఆకాశమనే సరస్సులో విహరించే "హంస వలె" అమృత కిరణుడు తోచాడు. ఈ ఉపమానం వాల్మీకంలో వివిధ సందర్భాల్లో ప్రయుక్త మయింది. ఇక్కడి నుండి తొమ్మిది పద్యాలూ స్వతంత్రమైనవిగా కనిపిస్తాయి.

"నలిననైరి పొలిచె నడిమింట నిశ్చల
ధ్యాన గతుడు పరమహంస వోలె"

ఇది లోకోత్తరమైన భావన. చంద్రుడు నిశ్చలమయిన ధ్యానంలో పరమ యోగి వలె నున్నాడు.

"చిద్విశిష్టమయిన చేతనత్వమువలె
జవుకు మనియె తరు కిసాలయములు"

జ్ఞానంతో విశిష్ట మయిన చేతనత్వం వలె చెట్ల చివుళ్ళు అందగించాయి, ప్రకాశించాయి. ఈ వర్ణనం ఆ సమయంలో హనుమ నిర్ణయాని కనుకూలమయిన మనో రూపాన్ని ప్రతిఫలిస్తూంది. "నలిన వైరి"లో "నలినం" లౌకికమయిన రాగానికి

చిహ్నమై, "నలిన వైరి" అన్నది లౌకికేతర మయిన దీప్తిని భావింప జేస్తూంది. చంద్రుడని అర్థం వచ్చే పర్యాయ పదాల్లో సమాసాల్లో పదాల సహయోగంతో విశేషార్థాన్ని భావింప జేసే శిల్పం రచనలో కనిపిస్తుంది.

"ముత్తెముల గొడుగు వియత్తు తారకల జా
బిల్లి నడుమ వెండి బిళ్ళ యొప్పు
తోట లోని గాలి తూగిన జాలరుల్
చివర కెంపు లొలయు జిలుగు వెలుగు"

గగన మనే (ముత్యాల) గొడుగుకు చుక్కల ముత్యాలతో, మధ్యలో జాబిల్లి వెండి బిళ్ళలా ఉంది. తోట పయి నుండి వచ్చే గాలికి కదలే కుచ్చుల చివర వ్రేలాడే కెంపులవలె, అందమయిన వెలుగులు ఒప్పారాయి. ఇది కాల్పనికం. నిత్య జీవితంలో వాడే సాధనం గొడుగు, చంద్ర వర్ణనంలో అలంకార యోగ్యతను పొందింది.

"యోగి హృదయ సీమ నొప్పారు సచ్చిదానంద మూర్తి చందిరుండు
అతడు వదలి పెట్టి నట్టి రాగాది కషాయ తరు కిసాలయములు"

ఇది ఆధ్యాత్మిక భావ సంపన్నమయింది. యోగి హృదయ క్షేత్రంలో ఒప్పారే సత్ చిత్ ఆనందంతో కూడిన ఆత్మ రూపం చంద్రుడుగా, కవి భావనలో తాత్త్విక శోభతో కవితా రూపం ఉదాత్తమయిన కల్పనా రమణీయకతను పొందింది.

అతడు వదలి వేసిన రాగము మొదలయిన విషయాభిలాషలు ఎరుపు రేఖలు! తరు కిసాలయాలుగా కనిపించాయి. ఇది మరో మలుపుకు సూచన. హనుమలో మిగిలిన తన పని పట్ల చెదరని అభిలాషను సూచిస్తోంది.

ఈ సన్నివేశం భావ రూపాల పరంపరతో విలసిల్లింది. ఇవి కాల్పనికంతో తాత్త్వికంతో వాస్తవ జీవిత రూపాలతో ప్రకృతి రూపంతో ఉదాత్తమయిన సృజన రూపానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. సంక్షిప్తత భావ సాంద్రత అభివ్యక్తి సౌందర్యంతో కవిత్వం అన్ని స్థాయిల్లోని పాఠకుల్నీ ఆకర్షిస్తుంది.



ఇది అడవిలా ఉంది. తపస్సుకు అర్హమైందిగా మనస్సుకు తోచింది. హనుమంతుడు చంద్ర దర్శన ప్రభావంతో తత్కాలంలో పొందిన విషాద భావాన్ని చిత్ర చిత్రమయిన ఊహలతో మరలించుకున్నాడు. పరిణతమయిన ప్రజ్ఞామూర్తివలె "ప్రయత్న నైష్ఫల్యాన్ని అంగీకరింపక" పునర్విచయనానికి సిద్ధ మయినాడు. "కవి శిల్పి భావ భావనా పరమేశ్వ"రుడుగా కవి దృష్టిలో మహనీయమయిన స్వరూపాన్ని పొందాడు. పరోక్షంగా కృతిలోని ఉదాత్త భావనా రూపాన్నీ దర్శన శీలాన్ని భావింప జేస్తూంది. ఇందులో హనుమలో శివాంశనూ దృష్టికి తేవడం జరిగింది.

ఈ భాగం వాల్మీకంలో చంద్ర వర్ణనం కన్నా భిన్నంగా స్థలం సందర్భం మనోరూపంలో మార్పుల ప్రత్యేకతలతో సన్నివేశ నిర్మితి జరిగింది. ఉత్తమమైన సృజన చేతనతో రమణీయమైన కవిత్వనూ సమాలోచనంలో నిలుస్తుంది. విశ్వనాథ స్వతంత్రమైన ఉదాత్తమైన వర్ణనా దీప్తిలో తాత్త్విక పార్శ్వాన్నీ తలపిస్తూంది.

h h h

# 8. అనుభూతి శిఖరం

వాల్మీకి రామాయణం ప్రాతిపదిక పయి కావ్యావిష్కారాన్ని పొందిందీ రామాయణ కల్పవృక్షం. విశ్వనాథ సృజన చేతనతో ఉపజ్ఞా మహితంగానూ దృష్టికి వస్తుంది. తెలుగులో కవి కల్పనా శక్తినీ పాత్రోన్మీలనాన్నీ సూక్ష్మమయిన అనుభూతి గుణాన్నీ ప్రకాశింప జేసే చిన్న చిన్న భాగాలు మధ్య మధ్య కనిపిస్తాయి. ఇవి స్వతంత్రమయినవీ. వీటిలో ఒకటి యుద్ధం తరువాత తిరిగి వచ్చే సమయంలో పర్ణశాలా సందర్శనం. యుద్ధ కాండలో యుద్ధం ముగిసాక లంకలో విభీషణుడు రాజుగా శాంతి ప్రక్రియను స్థాపించి పుష్పక విమానంలో అయోధ్యకు తిరిగి వచ్చే సందర్భంలో త్రికూట పర్వతం పయి లంకా నగరం మొదలుకొని సముద్ర సహితంగా అయోధ్య వరకూ వివిద ప్రదేశాల్లోని ఎన్నో దృశ్యాల్ని శ్రీరాముడు సీతకు చూపిస్తాడు ఈ క్రమంలో పంచవటిలో పర్ణశాలను సమీపిస్తారు. మూలంలో యుద్ధ కాండ 126 సర్గలో, 40వ శ్లోకంలో

"పర్ణ శాలా తథా చిత్రా దృశ్యతే శుభ దర్శనా
యత్ర త్వం రాక్షసేంద్రేణ రావణేనాపహృతా బలాత్"

చిత్రంగా చూడడాని కెంతో మనోహరంగా ఉన్న పర్ణశాలను చూడు! ఎక్కడయితే నీవు రాక్షస రాజు రావణునిచేత బలాత్కరింపబడినావో! ఆ ప్రదేశం ఇది. కల్పవృక్షంలో యుద్ధకాండ చివరి భాగం ఉపసంహరణలో ఈ సన్నివేశం మనః ప్రభావ సమర్పకంగా విలసిల్లింది. భౌతికాశ్రయమైన కథా శరీరాన్ని పొందింది. హృదయాశ్రయమైన అనుభూతి శిఖరాల్ని స్పృశిస్తుంది.

సీతా రామ లక్ష్మణులు పుష్పక విమానం నుండి దిగుతారు. సీత పర్ణశాలకు 'ప్రదక్షిణం'గా సంచారంచేసి బయటినుండి లోపలికి వెళ్ళే సీత అక్కడున్న వారికి ఏదో విధంగా ప్రత్యేకంగా కనిపించింది. రచనలో ఇదొక పార్శ్వం. ఇది సీత పర్ణశాలను చూడగానే పొందిన మానసిక స్థితి రూపం

"లోనికి జన్న పృథ్విజ వికలోకన లోక జయ ప్రగల్భ ప్ర
జ్ఞా నిధి సింహయాన వికసన్నవ లోచన పుండరీక, ర
క్షో నివహంబునం దగడు సొచ్చిన శీర్ణ తనూ ప్రబంధ సం
ధ్యా నవ వహ్నికా విరచి తాకృతి యాకృతిమత్ ప్రతిజ్ఞయున్"

లోకాన్ని జయించే మనోధైర్యంతో ఉంది. బుద్ధి విశేషానికి నిక్షేపంలా ఉంది. సింహం వలె చురుగ్గా నడుస్తూంది. కళ్ళలో విస్ఫారిన కొత్త తామర పూల వికాసం ఉంది. తనను అపహరించిన రాక్షసుని నివాసంలో బాధ చేత తప్తమయిందీ. అపనిందకు గురి అయిందీ. అనల ప్రవేశంతో సంధ్యాకాల వహ్ని రూపాన్ని పొందిందీ, పవిత్రంగా బయటపడిందీ. బహు సంవేదన చేత శుష్కించిన సడలిన శరీరావయవ సముపేతంగా ఉందీ. ఆమె ఆకృతి తనలోని ప్రతిజ్ఞా భావంతో నిండిందీ. ఈ పద్యంలో రావణుడు అపహరించిన స్థితి మొదలుకొని ఆమె అనుభవించిన అనేకమయిన ఘట్టాలు మనసులో మెరపుల్లా మెరుస్తాయి. వీటిని కవి నేరుగా చెప్పలేదు. వివరణ కవకాశం లేదు. ఇవి ఆమె ఆకృతి విశేషంచేత ప్రతీయ మాన మవుతున్నాయి. ఈ సందర్భంలో కవిత్వం బాహ్యమయిన స్థాయిని దాటి మానసికమైన స్థాయిలో అనుభూతి శిఖరాన్ని స్పృశిస్తూంది. ఇది సాధారణమైన వర్ణనకు భిన్నమైన మనోరూప చిత్రణం

లోపలి నుండి బయటికి వస్తుంది. ఆస్థితి అక్కడ ఉన్న వారికి మరో విధంగా కనిపిస్తుంది. ఇది మరో పార్శ్వం. ఇంతకు ముందు చూచిన దానికి పూర్తిగా వేరయింది.

"వెలికిని వచ్చు జానకియు పిన్న వయస్సుది, మందయాన మం
జులతర మూర్తియై యడవి జొచ్చిన అంతిపురంబు కన్య దే
హ లలిత సౌకుమార్య పర మావధి, రాఘవ బాహులగ్న, అ
ల్లలనయి వీచు గాలి కద లాడెడు క్రొంజిగురాకు బోడియున్"

ఇదీ లోపలికి వెళ్ళగానే మారిన మానసిక స్థితితో ఏర్పడిన రూపం. ఆమె వయస్సులో చిన్నదిగా తోచింది. మెల్లగా నడుస్తూ వస్తూంది. మనోహరమయిన రూపంతో అడవిలోకి ప్రవేశించిన అంతఃపుర కన్యలా ఉంది. శరీరంలో లాలిత్యం సౌకుమార్యం పరమావధి పొందినట్లుంది. శ్రీరాముని బాహులగ్నమయి అడుగులు వేస్తూంది. మెల్ల మెల్లగా వీచే గాలికి కదలే కొత్త చివురాకులా ఉంది. ఇదీ ఆమె పొందిన మానసికమైన అనుభూతి ప్రభావం. ఆమె లోపలికి వెళ్ళగానే, పూర్వం రామునితో సుఖంగా గడపిన అనుభవ స్మృతులు కదలాయి. వీటి ప్రభావానికి మనస్సు

లోనయింది. ఆమె వివశ అయింది. భౌతికంగా వశం తప్పిన మానసిక స్థితిలో పక్కనే ఉన్న శ్రీరాముడు సాంత్వన మూర్తి అయ్యాడు. అతని బాహువులపై వాలింది. ఈ భౌతిక స్థితిలో పైకి కనిపించని మానసిక రూపంతో వెలుపలికి వచ్చింది. పతి బాహువులపై వాలిన ఆమె ఆ క్షణంలో హృదయం పారవశ్యాన్ని పొందింది.

శాలాంతరంలోకి వెళ్ళి బయటి వచ్చే ఆకృతిలో హఠాత్పరివర్తన కక్కడ ఉన్నవారంతా చకితులయినారు

"అందురు నివ్వెరపోయిరి అందరు నాశ్చర్య పడిరి అందరు దుఃఖం
బందిరి రావణుడెంతటి చిందర పరచెను లతాంగి చిత్తం బనుచున్"

అంతా నిశ్చేష్టులయినారు. వాళ్ళ దృష్టికి పైకి తోచే అర్థంలో ఆమెను రాక్షసుడెంతటి క్షోభకు గురిచేసాడు! ఆమె మనస్సు ఎంత ఛిన్న భిన్నమయిందీ! అన్న ఆలోచన పై పొరలోది. ఈ పై పొరతో కూడి ఉన్న లో పొరలో ఆమె మరో అనుభూతిని పొందింది. లోపలికి వెళ్ళేప్పుడు వ్యతిరేకంగా ఉంది. బయటికి వచ్చేపుడు సానుకూలంగా ఉంది. ఈ సూక్ష్మానుభూతి స్పందనలు ఆమె వ్యక్తిత్వంలో ఆంతర భాగాలు. ఆమె మానసికంగా బాధ నుండి ముక్తమై సహజ స్థితికీ జడత నుండి తేరుకొని పారవశ్యానికీ, చేరిన మనో రూపం ఈ సందర్భంలో అనుభూతి శిఖరంగా కావ్యానుభవంలో నిలుస్తుంది. లోపల పతి అమృత స్పర్శతో తేరుకుంది, ఉపశమనం పొందింది. బయటికి వచ్చింది. ప్రసన్నతను పొందింది. పుష్పక విమానంలో యానానికభిముఖియయి మరో ప్రదేశానికి కదలింది.

ఒక పార్శ్వంలో దృష్టి బుద్ధి నడకలో విశేషంతో కన్నుల్లో వికాసంతో మానసికమైన వ్యథతో ప్రజ్ఞా మూర్తిత్వంతో పునీత చరిత్రగా రూపొందింది. మరో పార్శ్వంలో పూర్వానుభవాల స్మృతి విశేషాల మానోజ్ఞత్వంతో వివశతతో భర్త సుఖ స్పర్శతో శాంతమయిన అనుభవ విశిష్టమయిన ప్రత్యేకతను పొందింది. ఈ సన్నివేశం చాలా చిన్నదయినా ప్రభావోపేతంగా ఉంది. అనుభూతి శిఖరంగా వివేచనలో నిలుస్తుంది. విశ్వనాథ అనుభూతి సాంద్రమయిన ఉపజ్ఞకు నిదర్శనంగా ఉంది.

h h h



# 9. ఆధ్యాత్మిక తేజం

రామాయణ కల్పవృక్షంలో సీత పాత్ర మూడు స్థాయిల్లో సమాలోచనానికి అందుతుంది. 1) భౌతిక రూపం 2) మానసిక ప్రకాశం 3) ఆధ్యాత్మిక తేజం. మూడోది ఈ మహా కావ్యంలో ఉత్తరోత్తర స్థాయి బలమైన స్థితిని పొందింది. ఇది కావ్యంలో అర్థాంతర దీప్తికీ హేతువవుతూంది. ఇవి ఒక దాని నుండి మరొకటి వేరుగా ఉంటూనే కింది నుండి పైకి క్రమంలో అన్యోన్యాశ్రయాలవుతాయి. తమ ప్రభావాన్నీ సూక్ష్మ సూక్ష్మంగా ప్రసరిస్తాయి. దేని ప్రాధాన్యం దానిదే అన్నట్లు ఉన్నా భౌతికం కన్నా మానసికం మానసికం కన్నా ఆధ్యాత్మికం ఒక దాని కన్న మరొకటి ఎత్తుగా ఉత్తమ కవిత్వంలో అందునా రామాయణ రచనలో భాసించడం కవి ప్రతిభాధీనమయింది. వాల్మీకి రామాయణంలో 1) సూటిగా చెప్పబడనివీ 2) సూచన చేయబడినవీ 3) ఆలోచనార్హమయినవీ 4) అనుభూతి శీల మయినవీ కల్పవృక్షంలో మూలం నుండి ఉద్గమించి ఎదిగి వివిధ శాఖా సంపన్నంగా విస్తరించిన రూపం దృష్టికి వస్తుంది. స్వతంత్ర మయిన సృజన చేతనతో విలసిస్తూంది. వీటిలో ప్రధానమయిందీ ఆధ్యాత్మిక తేజం. విశేష స్థితుల్లో మాత్రమే ఆవిష్కారం పొందింది. ఇది రచనలో ఎక్కడ బడితే అక్కడ కనిపించదు. దీనికి అనువయిన స్థితిలోనే ప్రకటిత మవుతుంది. సముత్కంఠ స్థితిలో సమున్నత స్థాయిలో గభీర దర్శనంతో ప్రత్యక్షమవుతుంది. ఇది కీలక మయిన స్థానాల్లో నిలబడేది కాబట్టి అరుదుగా కొన్ని చోట్ల మాత్రమే గోచరించడం సహజం.

కల్పవృక్షంలో నిర్మాణ ప్రణాళికలో అనుస్యూతంగా ఉన్న తాత్త్విక ప్రసారంలో ఆధ్యాత్మిక తేజం శేఖరీభూతంగా పొందుపరచబడింది. ప్రకృత సమాలోచనం సీత పాత్రకు మాత్రమే పరిమితమయింది. అదీ సూచనా ప్రాయంగా. ఇదీ కృతిలోని ఆమె మహా వ్యక్తిత్వాన్ని అవగతం చేసుకోవడానికి బాగా ఉపకరిస్తుంది. లో పొరల్ని విశ్లేషిస్తే పైకి కనిపించే రూపం వేరు. లోపలి మనోరూపం వేరు. దానిలోనూ ఆంతరమైన దివ్య రూపం వేరుగా గోచరిస్తాయి. పాత్ర వర్తనలో శ్రేణులుగా నిలపబడీ బింబిస్తాయి. ఈ అంశాన్ని ఎత్తి చూపడమే ప్రకృతోద్దేశం. ఈ అంశంపై మహా కావ్యం మొత్తం మీద సమాలోచనం ఒక గ్రంథమవుతుంది. దీనివల్ల సహృదయులయిన పాఠకుల అవగాహనా పరిధి పెరుగుతుంది. అనుభూతి సాంద్రత కవకాశమిస్తుంది. రచన పట్ల విముఖతను తొలగిస్తుంది. సుముఖతను ఏర్పరుస్తుంది. కావ్యాస్వాదనంలో

పరంపరకు కారణమవుతుంది. చదివే పద్ధతికి ఉపకరిస్తుంది. ఉత్తమ సమాలోచనం ఆశించే ప్రయోజనమూ ఇదే.

## II

వాల్మీకి రామాయణం అరణ్య కాండ **34** సర్గలో శూర్పణఖ సీతను గురించి రావణునికి వర్ణించి చెబుతుంది. ఇందులో సీత విశేషమయిన వ్యక్తిత్వం తలపుకు వస్తుంది. ఆధ్యాత్మిక తేజాన్ని స్పృశించే సూచన ఉంది.

"దేవతేన వనస్యాస్య రాజతే శ్రీరివాపరా" వన దేవత వలె మరో (భూలోకంలో అవతరించిన) లక్ష్మి వలె ప్రకాశిస్తూంది.

"నైవ దేవీ న గంధర్వా న యక్షీ న చ కిన్నరీ
నైవం రూపా మయా నారీ దృష్ట పూర్వామహీతలే"

ఆమె దేవత కాదు. గంధర్వికాదు. యక్షి కాదు. కిన్నరి కాదు. ఇటువంటి రూపం నా చేత పూర్వం మహీ తలంపై చూడ బడ లేదు. నేతి (న+ఇతి) నేతి (న+ఇతి) అన్న విధంగా సాగింది. మూలంలోని వివిధ భావ స్ఫూర్తులు ఆధారంగా కల్పవృక్షంలో రచన సృజన చేతనను పొందింది. "అమ్మధురావలోకనములద్భుత మయ్యెడు" అన్న పద్యం చాలా విఖ్యాత మయింది. ఈ భావనా జగత్తులోదే. దీనికి పరాకాష్ఠగా మారీచలో

నిగమ మహార్థముల్ జగము
నిండెను తన్నిగ మాంత వైఖరుల్
నిగమ చయమ్ము కన్న హవ
ణించెను తన్నిగ మాంత చూడమై
తగిలెను బ్రహ్మ నా బడు ప
దార్థము బ్రహ్మము మౌళి సీత క్రొం
జిగురు పదంబు గోటి రుచి
చే, రుచి మంత మిదెంత చిత్రమో!

వేదాల్లోని మహార్థం వేదాంతం గానూ ఉపనిష న్మతంలో చివరి రూపం బ్రహ్మము గానూ భావిత మయింది. ఈ బ్రహ్మము మౌళి (శ్రేష్ఠ మయిన శిఖర రూపం) సీత



కొంజివురు పదం వెలుగు చేత కాంతి వంత మవుతూంది. ఇది లోకోత్తర మయిన భావన. ఇది శూర్పణఖ రావణునికి సీత పట్ల అభిలాషను ఇనుమడింపజేయడానికీ, కోర్కె పట్ల గాఢత్వాన్ని కలిగించడానికీ అన్న మాటే కావచ్చు. ఆమెకు ఆలాంటి ఊహ రావడం విశేషం. లోపలి మనో రూపాని కందిన నిజాన్ని ఆశ్రయించి భావన వెలువడింది. ఈ సందర్భంలో ఆమెకు అవసరమయిన లౌకికమయిన కార్య సాధనకు సంబంధించిన ఆలోచనలో పరమ మయిన విషయం గర్భిత మయింది. ఆ సమయంలో దీని ప్రభావ పరిణామంగా ఆత్మ వస్తువు యొక్క వికార రూపాలు "భయమూ మోహమూ" రావణుని క్రమ్మే సాయి. రావణుడు బహు సులభంగా మోహ వివశుడయినాడు. కారణం మనుషుల్లో స్థూలంగా రెండు విధాలుగా ఉంటారు. ఒక విధం భావ నిష్ఠులూ మరో విధం దేహ నిష్ఠులూ. ఈ రెండు విధాల్లో తర తమ భేదా లెన్నో! వివిధ దశల్లో ఏర్పడతాయి. భావ నిష్ఠుల ఆలోచనలు దేవతా రూపానికి దగ్గర దగ్గరగా అవుతూ పోతాయి. దేహ నిష్ఠుల ఆలోచనలు రాక్షస రూపానికి దగ్గరగా చరిస్తాయి. వీటి దగ్గరను బట్టీ దూరాన్ని బట్టీ అవాంతరభేదాలెన్నో! వివిధ పాత్రల్లో రామాయణంలో కనిపిస్తాయి.

రావణుడు రాక్షస ప్రముఖుడు. ఏక వస్తువు వికార రూపాల్ని పొందడమూ అవి ఆవేశించడమూ వాటికి వశం కావడమూ ఆ ప్రకృతికి సులభమూ సహజమూ. శూర్పణఖ అంతటి ఆగలేదు. "సరస్వతీ దేవి సౌందర్యం" తెలుసు. ఆలోచించిన కానీ పొడ గట్టదు. భవాని సౌందర్యమూ ఎరుగుదు. "తదేక ధ్యాన నిష్ఠగాని రూపు కట్టదు," అంటుంది. సరస్వతి మరియు భవాని తర్వాత మిగిలిందెవరో ఊహకు వదలి వేయబడింది. వాల్మీకంలోని "అపరా లక్ష్మీరివ", తో పాటు మరి కొన్నిటిలోని ఆంతర్యాన్ని వ్యాఖ్యానించడం జరిగింది. ఇంకా అన్వయం చేసుకోవలసిన అంశాలు మంత్ర ముగ్ధమయిన వాల్మీకి రచనలో అనుభవానికి వస్తాయి. ఆ విషయం వేరు. కల్ప వృక్షంలో కొత్త రూపాన్ని పొందాయి.

తరువాత మరొక మారు రావణునితో శూర్పణఖ,

"ఏ విద్యుల్లహరీ ప్రవాహములో యి
ట్లే సర్వ నాళంబులన్
ప్రావృట్కాల పయోద శీతల మరు
త్ప్రాగ్భార సంసృష్టిగా

క్రోవుల్ కట్టి మనోజ్ఞ సారణ తనూ
రోమాంధువుల్ సొచ్చి, యం
దావిష్కారము పొందు పుల్కలుగ, మో
హానంద సంధాయియౌ''

ఇది సాధారణమయిన వర్ణనం కాదు. భౌతిక మానసిక ప్రభావాల వివేచనాత్మక మయింది. అనుభూతి దఘ్నతను విశేష స్థాయిలో చూపేది. భౌతిక మానసిక రూపాల్ని దాటింది. ఆనంద సంధానకం మనోవలయాన్ని దాటి ఆత్మవలయంలోకి ప్రవేశించే స్థితిలోనే, కాబట్టి ఆత్మ రూపానికి దగ్గరవుతూంది.

ఏ విద్యుత్ లహరీ ప్రవాహాలో శరీరంలో సర్వ నాళాల్లో ప్రసరిస్తున్నట్లుంది. వర్షా కాలంలో మేఘంలా చల్ల నయిన గాలి అతిశయంతో నిండుగా శరీరమంతా స్పృశిస్తూంది. ప్రసార వాహికలుగా శరీరంలో రంధ్రాల్ని ప్రవేశిస్తూంది. అణువణువూ విస్తరిస్తూంది. సీతను చూడగానే అనుభవ పారమ్యాన్ని ఆవిష్కరిస్తూంది. శరీరాన్ని పులకరింపజేస్తూంది. మోహంతో ఆనందాన్ని సంధానింప జేస్తూంది. ఈ దశలన్నీ ఝటితి స్ఫూర్తిగా అనుభూత మయ్యే సూక్ష్మమైన భావనతో పద్యం రచనా శిల్పాన్ని పొందింది. ఇవి శూర్పణఖ తన మాటల చేత రావణుని సీతను అపహరించడానికి త్వరపడ జేసే ఒక ఎత్తు అయినప్పటికీ, స్థూలంగా ఈ భావ రూపాన్ని పొందడం గమనించదగింది. అది ఆమెలో నిలవక పోవచ్చు. వివేకానికందక పోవచ్చు. అనుభవంలో పరివర్తితం కాక పోవచ్చు. శూర్పణఖ విషయంలో అంతటితో అదృశ్యమయింది. ఇది దేహ నిష్ఠుల ప్రకృతి సహజం. మరో కోణంలో కవిలో ఆధ్యాత్మిక భావంతో ఆగని మనో రూప ప్రభావమూ కావచ్చు. పలు కోణాలతో సుందరమైన భావనా రూపం కవితాకృతిని పొందింది.

అరణ్య కాండలో మారీచ ఖండంలో సీతను ప్రశ్నిస్తూ రావణుడు పలికిన మాటల్లోనూ ఈ స్ఫూర్తి ఉంది.

'కా త్వం కాంచన వర్ణాభే! పీత కౌశేయ వాసిని
కమలానాం శుభాం మాలాం పద్మినీ మివ బిభ్రతి''



వాల్మీకంలో (46 సర్గ) పరమ మనోహరమయిన రచనలో సీతా దేవి రూపం వెనక లక్ష్మీ స్వరూపం భాసిస్తూంది.

బంగారు వర్ణ కాంతి కలిగి పట్టు వస్త్రం ధరించి ఉన్న నీవెవరు? శరీర భాగాలు (నయనాలూ కరాలూ పాదాలతో) కమలం యొక్క శోభను పొందుతున్నాయి. 'కమలా' శబ్దం ఆయువు పట్టుగా ఉంది. 'పద్మినీ' శబ్దం కీలకమయింది.

"హ్రీః కీర్తిః శ్రీః శుభా లక్ష్మీః'' "భూతిర్వా'' - శ్లో. 16

మొదలుగా శుభాననే సంబోధనంతో వర్ణనంతో లోకోత్తరమయిన శక్తి స్వరూపాన్ని ఆవిష్కరిస్తూంది. నీవు పార్వతినా? కీర్తివా? శోభా సంపన్నమయిన మూర్తివా? శుభ రూపానివా? లక్ష్మీదేవివా? ఐశ్వర్య రూపిణివా? మొదలుగా ఉన్నతమైన స్థాయిలో ఉన్న దివ్యమయిన భావ రూపాన్ని సులభంగా గుర్తించవచ్చు.

"కా త్వం భవసి రుద్రాణాం మరుతాం వా వరాననే
వసూనాం వా వరారోహే! దేవతా ప్రతిభాసి మే'' శ్లో. 27

నాకు దేవతగా భాసిస్తున్నావు అంటాడు. ఎవరు నీవు? రుద్రులకు మరుత్తులకు వసువులకు సంబంధించిన దేవతా మూర్తిగా అనిపించడంలో ఆ మానసిక స్థితి వివేచనార్హమయింది. ఆ స్థితిలో ఇదమిత్థమని నిర్ణయానికి రాలేని లక్షణంలో మహనీయమైన ఆధ్యాత్మిక జగత్తునకు సంబంధించిన దివ్య రూపం మెరపులా అనుభవానికి వస్తుంది. వాల్మీకి రచనలో లౌకికేతరమయిన దివ్య భావన ఆలోచనలో ఎత్తుకు తీసుకొని వెళుతుంది. సీత అపుడున్న స్థితి 'పద్మ హీనమివ శ్రియమ్' అని మహర్షి, అనడంలో ఔచిత్యం సహృదయైక వేద్య మయింది. సీత ఆ స్థితిలో పద్మాన్ని ధరించని అంటే వదలిన లక్ష్మీదేవిలా ఉంది. వన వాసంలో ఉంది. రాజ్య సంపద నుండీ తొలగింది సాధారణ మయిన భోగ భాగ్యాలకూ దూరమయింది. పద్మం వీటికి ప్రతీకగా ఉంది. అది తొలగింది, దూరమయింది.

ఈ భాగం కల్పవృక్షంలో తెలుగు భాషలో ప్రసిద్ధమయిన పరంపరాగత మయిన కావ్య మర్యాదానుకూలంగా సూచనా ప్రాయమైన అంశాలతో తీర్చబడింది. రచనలో ఇతర ప్రక్రియల ప్రభావమూ కనిపిస్తుంది.

## III

శ్రీరాముడు సీత కోరికను తీర్చే సంకల్పంతో కాంచన మృగం కోసం వెళతాడు. సీత రాముని గళాన్ని పోలిన పిలుపులో స్వర సామ్యాన్నివిని లక్ష్మణునితో అన్నకు సహాయంగా వెళ్ళమని కోరుతుంది. ఆ సమయంలో తాను వదలి వెళ్ళడం మంచిది కాదని చెబుతాడు. ఆమె చాలా పరుషంగా మాట్లాడుతుంది. కోపం వచ్చింది. లక్ష్మణుని అనుమానించింది. "నాపై మోహము పెట్టుకోకు"మని హెచ్చరించింది. ఆ స్థితిలో "నేనాత్మేశ్వరి"ని, "యోగ మూర్తి"ని అని తన నిజ స్వరూపాన్ని ఆవిష్కరిస్తుంది. ఈ మాటలో ఆ వ్యక్తిలో నిహితమయిన ఆధ్యాత్మిక ప్రకాశరూపం స్పష్టంగా దృష్టికి వస్తుంది. ఇంకా తన విశిష్టతను చెబుతూ, ఇతర "నీరేజ పత్రాక్షులు" ఎంతటి సుందరులయినా తాను పోయిన త్రోవలో పయనించి ధర్మమనే లతకు పుష్పాలుగా వికసించాలి, అంతే! అని జీవిత పరమార్థాన్ని దర్శింపజేస్తుంది. ఇందులో ఆధ్యాత్మికతతో పాటు దానికి సన్నిహితంగా ఉండే ఆదర్శ క్షేత్రాన్నీ స్పృశించడంలో పాత్ర దివ్యమైన భావనతో ఉన్మీలితమయింది.

రావణుడు సీతను అపహరించి లంకలో తన వన సౌందర్యాన్ని సౌభాగ్యాన్నీ చూపిన తరువాత పరిచారికలతో పలికిన మాటల్లో " వెండి కొండ ఎత్తిన సమయం బునన్ కినుక దేరిన ఎర్రని కెంపు కన్నులందనరిన దేవి వచ్చె సముదారత భక్తి భజింపగా వలెన్" అంటాడు.

ఇది, కైలాస పర్వతాన్ని పెకలించి లంకకు తీసుకొని వెళ్ళే ప్రయత్నంలో, కోపగించిన పార్వతి కన్నులలో కెంపును (ఎర్రదనాన్ని), తన కన్నుల్లో వహించిన "దేవి" వచ్చింది, అన్న భావనలో పార్వతితో సమానమైన స్థాయిలో సీత అస్తిత్వాన్ని స్థాపిస్తుంది. ఈ ఆలోచనా సరళి పైకి ఎగతాళిగా అనుకున్నా, అనిపించినా పార్వతీ దేవితో సమానంగా చూచే ఉన్నతమైన భావోద్గమనం సీతలో దాగి ఉన్న ఆధ్యాత్మికాన్ని సూచిస్తుంది. అప్పుడున్న మనో రూప స్థితిలో ఇది మరో భావం చేత కప్పబడుతుంది. రావణుని విషయంలో అతనికి పైకి తెలియకుండా జరిగింది ఇదే. అతడు దేహ నిష్ఠమయిన జీవితానికి ప్రాధాన్యం ఇచ్చేవాడు కావడం చేత ఇది పాత్ర సహజమయిన పరిణామంగా తీర్చబడింది.



సుందర కాండలో పర రాత్ర ఖండంలో హనుమ సీతను మొదటి సారి చూడగానే పొందిన అనుభవ విశేషం ఈ అంశానికి పుష్టిని చేకూరుస్తుంది.

"ఈ యమ ముఖాబ్జమున
ఆధ్యాత్మిక మహస్సు లుదిత జ్యోత్స్నా
ప్రాయముగ నుబికి వచ్చెడు
ఈయమ జానకి యె సంశయేతర ఫణితిన్"

సీత ముఖంలో ఆధ్యాత్మిక తేజస్సును హనుమ గుర్తు పట్టాడు. ఈమె సీతయని నిశ్చయానికి కారణాల్లో ఇదొకటీ, బలమైందీ. ఇంతకు పూర్వం మండోదరిని చూచి సీత యని పొరపాటు పడ్డాడు. ఈమె ముఖంలో తేజస్సు ఉదయించే వెన్నెల వలె పొంగి వస్తుంది. "జానకి" అన్న మాటలో ఔచిత్యమూ ఉంది. జనకుని కూతురు, ఆయన బ్రహ్మవేత్తృతను పుణికి పుచ్చుకున్న దన్న భావనతో ఆలోచనా రమణీయంగా ఉంది. ఈమె దేహమున్న యట్లుగా లేనట్లుగానూ జ్వలిస్తుంది. 'సౌదామనీ సుభాసమనీ కాదు; ధృత విరాగితాకృతి నిరాదృతి" చేత ఏర్పడింది. కాబట్టి ఈమె వైదేహియే యని హనుమంతుని నిర్ణయం. ఈ పద్యం తాత్త్విక భావనా బలంతో సీత యౌగికమయిన లక్షణాన్ని ధ్వనింపజేస్తుంది. దేహం ఆధారంగా ఉండీ దానికి ప్రాముఖ్యం లేకుండా అందులో జ్వలన శక్తి అంటే యోగ విద్యా పరిణతమయిన అగ్నిమయ రూపం యౌగిక తేజస్సులో భాగమయింది. ఈ భావన అగ్ని ప్రవేశ సందర్భంలో  మరింతగా ఉదాత్త సుందరంగా ఆవిష్కృతమయింది. పదార్థానికి పాత్రలా దేహం ఉపయోగ పడుతూంది. ఆమె దేహం ఉన్నట్లూ లేనట్లూ మెరపు తీగె అనీ కాదు ఈ రూపాన్ని దాటిన మరొకటి వైరాగ్యాన్ని పొందిన ఆకృతి సూచితమయింది. రాగాదుల్ని అధిగమించిన స్థితిలో భౌతిక మయిన ఆసక్తి కన్నా, భౌతికేతరమయిన ఆపై, దివ్యమయిన ఆధ్యాత్మిక రూపం పట్ల అభిలాష ప్రాధాన్యం వహిస్తుంది. హనుమంతుని దృష్టిలో సీత యోగ మూర్తిగా అనుభవానికి రావడం సీత ఆధ్యాత్మిక రూపాన్ని స్థాపిస్తుంది. ఈ నేపథ్యంతో ఆధ్యాత్మిక తేజో భావన ఆమెను గుర్తించే ప్రధాన లక్షణాల్లో ఒకటిగా ఏర్పడడం కవి పాత్రౌచిత్యాన్ని భావింప జేస్తుంది.

యుద్ధకాండ సంశయ ఖండంలో రావణుడు హంసను చూచిన / దర్శించిన తరువాత వెంటనే సీత దగ్గరికి వెళతాడు. ఆమె ముందు మాయా కల్పితాలయిన

రామ లక్ష్మణుల శిర శర శరాసనాల్ని పోలిన వాటిన ప్రదర్శిస్తాడు. రావణుని మాటల కామె మూర్ఛపోతుంది. తేరుకొని చూస్తుంది. చెట్టు పై హంస కనిపిస్తుంది. పూర్వం హనుమంతుడు కూర్చున్న స్థానంలోనే కూర్చొని ఉంటుంది. ఆమె మనస్సులో మహానందం కలిగింది నియత వేళ ముగియడంతో శిర శర శరాసనాలు మాయమవుతాయి. రావణుడు మళ్ళీ తన ప్రతాపాన్నీ మోహాన్నీ ప్రకటిస్తాడు. హంసను చూచాక ఆమెలో ధైర్యం స్థిరీకృత మయింది. హంస వైపు చూడగానే నిముషంలో గాఢ సమాధిని పొందింది. తాను "ఈశ్వరేశ్వరి", "సనాతని" యన్న భావన భాసించింది. క్రీ పెదవిపై "చిరు నగవు" చివురించింది. అది సాధారణమయిన నవ్వులా లేదు. అతిలోక మోహనంగా ఉంది. అలౌకికంగా ఉంది. అది చూచిన రావణుని "దృగ్గోచులు" మందగించాయి. అతనిలో ప్రభ మాసినట్లనిపించింది. గుండె ఆగినంత పని అయింది. కోపం వచ్చింది. ఇంతకూ కారణం ఆ హంస అనిపించింది. ఆ రూపం ఎవరో మనస్సులో తోచింది. ఈ సన్నివేశం కవి స్వతంత్ర మయిన కల్పన, ఇందులో ఆధ్యాత్మిక రూపం శిఖరాయ మాణంగా సమాలోచన కందుతుంది.

యుద్ధ కాండ ఉపసంహరణలో సీత అగ్ని ప్రవేశం సందర్భంలో ఈ దిశలో వెలుగును ప్రసరిస్తూంది. వాల్మీకంలో 121 సర్గలో అగ్ని దేవుడు

"అంకేనాzదాయ వైదేహీమ్ ఉత్పపాత విభావసుః" అగ్ని ప్రాధాన్యాన్ని నిలుపుతూ, సీతాదేవిలో శక్తినీ ప్రకాశింప జేస్తూంది.

తండ్రి వలె సీతాదేవిని తన అంకముపై నిడుకొని బయటి వస్తాడు. "అక్లిష్ట మాల్యాభరణాం తథా రూపాయ్ మనస్వినీమ్" ఏ మాత్రమూ వాడని పూల మాలల అలంకారాలతో, అగ్నిలో ప్రవేశించే ముందు ఎట్లా ఉందో ఆ విధంగానే ఉంది. "విశుద్ధ భావాం, నిష్పాపాం" పవిత్రమయిన హృదయం కలిగిందీ. ఏ దోషమూ లేనిదీ" అని శ్రీరాముని కర్పిస్తాడు. ఈ భాగంలో సారభూతమయిన అంశాన్ని గ్రహించి కల్పవృక్షంలో చిన్న సన్నివేశం యోజిత మయింది. సీత ప్రవేశంతో అగ్ని రెండు "వహ్నులు"గా చీలింది. అందులో ఒకటి అరుణ వర్ణుడూ అరుణ కిరీటుడూ అరుణాక్షుడూ అయిన పురుషాకృతి రెండోది వసంతోదయ వేళ "కిసలయ మధురిత నవారుణాంగక"మయిన జానకీ దేవిగా కనిపించడం అందరినీ ఆశ్చర్య పరచింది.



సీతను అగ్ని దేవత తన జ్వాలల్లో నిలుపుకోలేక గ్రహించలేకపోయాడు. కారణం ఆమె యోగాగ్నిచేత పుంజీభూతమయిన తేజో రూపాన్ని పొందింది. ఇంకా కొంత సేపయితే ఆమె తేజో రూపం చేత అగ్ని కనిపించకుండా పోయే స్థితి ఏర్పడేది. ఆమె కృపామూర్తి! దీన్ని అగ్ని దేవత ముందుగానే గుర్తించి ఆమెను రామచంద్రుని కర్పించాడు. ఆమె రామచంద్రునిలో సగభాగం. ఆధ్యాత్మిక తేజంలోని నిర్మలిన నిష్పాప గుణంతో పవిత్రమయిన దివ్యమైన రూపం! ఆలోచనలో నిలుస్తుంది. మహాకావ్యంలో "ఆత్మేశ్వరి", "యోగ మూర్తి", "ఈశ్వరేశ్వరి", "సనాతని"యన్న మాటలతో మరో విధంగానూ సీత పాత్రలో సమాహిత మయిన ఆధ్యాత్మిక తేజోరూపం మహాకవి కల్పవృక్షంలో పరిమిత స్థలాల్లో నియత రూపాల్లో కల్పనలో రమణీయా కృతున్ని పొందింది.

h h h

# 10. హంస దర్శనం

రామాయణ కల్పవృక్షంలో యుద్ధ కాండ సంశయ ఖండంలో హంస ప్రవేశం దర్శన గుణ ప్రభావంతో కూడిన సన్నివేశం కవి స్వతంత్ర మయిన నిర్మాణ రూపాన్ని పొందింది. కథలో దీని ప్రయోజనం 1) సీతకు శ్రీరాముడు వార్తను పంపించడం 2) రామునిలో సంశయం ఉత్పన్నం కావడం. అది బలపడడం. 3) సీతలో దివ్యమైన అనుభూతి కలగడం. సందేశ కావ్యాలకు మార్గదర్శకమయిన మేఘ సందేశానికి వ్యాఖ్యానంలో మల్లినాథుడు శ్రీరాముడు సీతకు హనుమతో పంపిన సందేశాన్ని "మనసి నిధాయ", మనస్సులో ఉంచుకొని కాళిదాసు మేఘ సందేశ కావ్యం వ్రాసినట్లు (మేఘ సందేశ కావ్యం చికీర్షుః) భావించాడు. అయితే కల్పవృక్షంలో ఇది శ్రీరాముని "ప్రియా సందేశం"తో ముగియ లేదు, తరువాత రావణుని మనస్సులో సీతాపహరణం విషయంలో మలుపుకు కారణమయింది. సీతను గాఢ సమాధిలో ప్రవేశపెట్టి ఆధ్యాత్మిక జగత్తు యొక్క జ్ఞానాన్నీ ప్రకాశింపజేసింది. గాఢ సమాధిలోకి చేరినపుడు ఆమెలో యోగ శక్తి ప్రకటితమయింది. ఈ మహనీయమైన విశేషాల సంబంధం వల్ల సందేశ మనేది ఒక భాగమవుతూంది. ఈ స్వతంత్రమయిన కల్పనతో కవి ఉదాత్తమైన రచనా ప్రణాళికను భావింపజేస్తూంది. హంస చివరకు అక్షయ కుమారుని పుత్రునికి రావణుడు క్రీడా వస్తువుగా ఇవ్వడంతో ముగిసింది.

ముగింపు హృదయాన్ని కదిలించే గొప్ప కథన శిల్పంతో నిర్వహణ కళను పొందింది. ప్రస్తుత సమాలోచనం హంస దర్శనానికి మాత్రమే పరిమితమయింది. కవిలో స్వతంత్ర మయిన సృజన చేతనను స్పృశించే ప్రయత్నం చేయబడుతూంది.

సీత ఎక్కడ ఉందో? తెలియక ముందు శ్రీరాముడు హనుమతో సీతకు పంపిన వార్త ప్రసిద్ధమయింది. సీత ఎక్కడ ఉందో తెలిసాక రాముడు సముద్ర తటాన కనిపించిన హంస చేత వార్తను పంపడం ఇందులో ముఖ్యం. దీన్ని అనుసరించి మరికొన్ని జరిగాయి. అపుడూ సీతకు హనుమంతుని చూచి మొదట అనుమానం కలిగింది. ఆ తరువాత మహా సంతోషాన్ని పొందింది. ఇపుడు హంసను చూచీ చూడడంతోనే పరమానందాన్ని పొందింది.

హంస దర్శనంలో మూడు పొరలు వివేచన కందుతాయి. 1) బాహ్యం 2) మానసికం 3) ఆధ్యాత్మికం రామునిలో లీలగా సీతలో స్ఫుటంగా రావణునిలో సంశయ



గతంగా ఆంతరమైన భావనా జగత్తు విశ్లేషణ కందుతుంది. ఇది పరోక్షంగా విధి అపరిహార్యతను సూచిస్తూంది. రావణుడు గొప్ప శివభక్తుడు. ఆ శివుడే రాముని నుండి సీతకు హంస రూపంలో వార్తను అందించాడు. దేన్నీ ఎవరూ నియంత్రించలేరు, తన వైఖరిని బట్టి పరిణమించదు. అతీతమయి విలసిస్తుంది.

వార్త ఉద్దేశం 1) రాముడు తాను ఉన్న స్థితినీ 2) సముద్రాన్ని దాటి లంకాతీరం చేరిన విషయం 3) సీతకు తన ప్రయత్నం గురించి తెలియ జేయడం 4) ఆమెకు సాంత్వనం కలిగించడం. సీత గురించి రాముని మాటల్లో అశోక వనంలో శోకంలో 1) బహిరాకృతి 2) చింతనలో అంతరాకృతి 3) ఆంతరంలో ఆధ్యాత్మిక రూపం స్పష్టంగా దృష్టికి వస్తాయి. చివరి దానికొక ఉదాహరణ, రాముడంటాడు - "సీత నన్ను బ్రహ్మవిత్‌శీలం చేతనే వశం చేసుకున్నది". ఇలా మూడింటికీ సహేతుకమయిన ఆధారాలు లభిస్తాయి. ఈ మూడు స్థాయిల్లో సమాహితమయిన రచనా రూపం కవితాత్మకతను పొందింది. ఈ కృతి అవగతికి సాధారణ దృష్టికన్నా కొంచెం విశిష్టమయింది అవసరమవుతూంది. కాస్త సంప్రదాయ మార్గాల పరిచయంతో సుగమమవుతుంది. ఇది ఎట్లా ఉన్నా సాధారణ పాఠకుల్లో రామాయణ కల్పవృక్షం గురించి సదవగాహన కల్పించడమే ఉద్దేశం.

## II

పశ్చిమ సంధ్యోపాసనానంతరం సముద్రతీరాన ఒకశిలా తలంపై కూర్చుని ఉన్న రామచంద్రునికి రాజ హంస కనిపించింది. భౌతికంగా అలల పయిన ఈదుతూ హృదయానికీ కంటికీ ఇంపుగా ఉంది. దీని వర్ణనం ఆరు పద్యాల్లో అత్యంత మనోహరంగా ఉంది. రామునికి తనలో శయించిన విరహ భావాన్ని మేల్కొల్పేదిగా ఉంది. ఇది మానసికంగా హంస వలన జరిగిన ప్రభావం

"బరువౌ కాలము నందు యే తెలివౌ శోభా పూర్ణమై..."
...."హేమశ్రీ గరుత్ శ్రీ ప్రభాహర హంసాకృతి" గోచరించింది.

ఆ "తెలివి" అంటే పరమ మయిన జ్ఞానం / నిత్య చైతన్యం. దాని ప్రాణి రూప సంకేతమే ఈ హంస. ఇదీ నిర్మాణ మార్మికత లోని తాత్త్విక పార్శ్వం.

ఇందులో ఆధ్యాత్మికం అప్రత్యక్షంగా ఉంది అంతర్నిహితమై ఉంది. జ్ఞానాకారంగా హంస బంగారు కాంతి గల రెక్కల శోభతో ప్రకాశిస్తూంది. హరుడైన హంస యొక్క ఆకృతిలో ఆకర్షణ హేతువు కతీతంగా ఉంది. ఆ హంస ముడిచిన

రెక్కలతో నిలిచిన శంఖం పోలిక ఉంది. సూటిగా త్రిశూలం వీచినట్లుంది. పల్లటీలతో ఒడుపుగా నీటిలో కదలుతూంది. సముద్రమనే నీల మేఘాన్ని విదలించినట్లుంది. అక్కడ ఉన్న హంసలకు విద్యుదాకృతిలా నీళ్ళలో ఈదుతూ కనిపిస్తూంది.

"ముడిచిన రెక్కయై నిలువ
పోలిక శంఖముతోడ సూటిగా
కడలి పయిం ప్రమాణమును
కట్టిన ముమ్మొన వాలు వీచి నట్లు"

అన్న పద్యంలో పేర్కొన్న శంఖం విష్ణు సంబంధమయింది. ముమ్మొన వాలు (త్రిశూలం) శివ సంబంధమయింది. రెండు శక్తులూ కలిసిన అభేదమయిన (భేదంలేని) ఆత్మ రూపాన్ని సంకేతింప జేస్తూంది. విష్ణు శివ భావ సమర్పకంగా ఉంది. భక్తునితో సంబంధాన్ని కలిగి ఉంటూనే మన్నిస్తూనే ఈ రెండింటినీ భాగాలుగా చేసుకొన్న మహాశక్తికి ప్రాణి రూపంలో ప్రాతినిధ్యం వహిస్తూంది.

"లంకా పట్టణ దీర్ఘికా విహరణాలంకారమో హంస మీ
నాంక ప్రాణ హరానలోజ్వల శిఖాహంకార సౌందర్య రే
ఖాంకంబై" కనిపిస్తూంది.

ఈ సందర్భంలో లంకా పట్టణంలో దీర్ఘికల్లో విహరించే హంస అన్న భావనకూ వీలు కలిగింది. దీన్ని దాటి "మీనాంక ప్రాణ హరానలోజ్వల శిఖ" యైన "అహంకార సౌందర్య" రూపానికి చిహ్నంగానూ కనిపించింది. మీనాంకుడు ఒక సౌందర్య ప్రపంచానికి గుర్తు. ఈ సౌందర్యం మహా సౌందర్య రూపంలో ఒక భాగం మాత్రమే.

హంసలో కనిపించింది దివ్య సౌందర్యం. అయితే ఒక సౌందర్య భాగ రూపం మాత్రమే దగ్ధమయింది. మిగతాది మిగిలే ఉంది. రూప గుణ కర్మ భావనల్లో దేని అందం దానిదే. ఉత్తరోత్తరం బలీయంగా వర్తిస్తాయి. ఈ పద్యంలో శివుని అహంకార రూపం నుండి ఉద్భవించిన సౌందర్య భావాకృతి గురించి చెప్పబడింది. మన్మథుని దహనంతో ఇది అంతమయ్యే ప్రశ్నే లేదు. ఆ సమయంలో అది శివుని మూడో నేత్ర నుండి జ్వాలా శక్తి పరిది దాటింది కావడమే. ఇక్కడ మాత్రం శివమయమయిన సౌందర్య శక్తిని గురించి (అది నేను అన్న సంకల్పం నుండి ఉద్భవించింది) కవి భావన సాగింది. ఇది అహంకార యొక్క సౌందర్య రూపంగానూ పరిణమించింది.



దీనికి ఆశ్రయ మూలం సదహంకారం, సంకల్పానికి బీజం. ప్రభవానికి నిలయం. సృజనకు ఆధారం. ఈ కారణంగా రామునికి ... అహంకార సౌందర్య రేఖాంకంగా కనిపించింది. ఇలాంటి విలక్షణమయిన హంసను "సంకేతింపగ వచ్చునో రఘుకుల స్వచ్ఛేందు దేవేరికిన్" అన్న భావం ఉదయించింది. ఇదంతా వివేచనలో తోచే అంశం. అనుభవంలో సూక్ష్మమయిన భావనా మయంగా ఉంటుంది. భావాన్వయంలో 1) అహంకారం నుండి 2) అహంకారం యొక్క 3) అహంకార మనేక విధాలుగా సౌందర్య రూపం వివేచనలో భాసిస్తుంది. మహ దహంకార సంకల్పం నుండి జనించిన సౌందర్య రూపం అనుభూతికి వస్తుంది.

ఆ కనిపించిన హంస వియోగ భావం వల్ల పుట్టిన కోరిక రూపమో? కన్ను చెదరిందేమో? యథార్థమైన హంసయో? బయటికి హంసాకృతి కలిగిందో? ఏదీ తెలియకనూ తెలియని తనంలోనూ ఒక విలక్షణమయిన అనుభవ "లాలస" కలిగింది. పై సందేహాలన్నీ భౌతికాశ్రయాలు చివరి అనుభవ రూపం ఆంతరమయింది. దీనితో తృప్తికరమయిన సమాధానం దొరికినట్లయింది. భౌతికం / బాహ్యంలో పూర్వం మాయాహరిణానుభవంతో అనుమానం సందేహం కలగడం భౌతిక సహజం. దీన్ని అధిగమించి విలక్షణమయిన అనుభవం కలగడం ఆంతర విశేషం.

## III

హంసతో పలికిన ప్రియా సందేశంలో సీతకు తన వ్యథను తెలుపుతాడు. హనుమంతుని వల్ల సీత ఉన్న చోటు తెలిసి నెలకు పైన అయింది. అశోక వనంలో ఉన్న సీత శోక వనాన్ని పొందవచ్చు. 'నా సఖుడవై' అక్కడి వెళ్ళమనీ తాను సముద్రం దాటి వచ్చిన "వార్త" నందించి ప్రయత్న సాఫల్యాన్ని చెప్పమనీ కోరతాడు.

"అసు హృత్పద్మ దళాంత వర్తివిని! హంసాధ్యక్ష!
తత్ శుభ్ర మానస సంచారివి" అన్న మాటల్లో హంస గురించి రామునిలో ఏర్పడిన పవిత్రమైన ఉదాత్తమైన భావన విదితమవుతూంది. హంసకు వేసిన విశేషణాలు ఆలోచించిన కొద్దీ తాత్త్వికమైన గభీరతతో కవితా రామణీయకాన్ని కలిగినవి. ప్రాణ హృదయమనే పద్మ దళాల మధ్య వర్తించే లక్షణం భారతీయ తత్త్వ చింతనలో పరమాత్మ భావనా ప్రపంచాన్ని భావింపజేస్తూంది. హంస సామాన్యమైంది కాదన్న విషయం ఆధ్యాత్మికం వైపు దృష్టిని మరలుస్తూంది. "హంసశ్శుచి రంతరిక్షషద్" అన్న

ఉపనిషద్వాక్యం జ్ఞాపకం వస్తుంది. ఈ పద్యంలో హంసాధ్యక్ష అంటే పరమాత్మ రూపమనీ 'శుభ్ర' అంటే స్వచ్ఛమయిన తెల్లనయిన నిర్మలమయిన "శుచి" రూపమనీ కాస్త ముందుకు వెళ్ళితే సూక్ష్మంగా చైతన్య ప్రకాశమనీ సంచార మంటే "సద్" (ఉన్నది) ఆత్మ అన్న దానికి సందర్భ వివరణమనీ అన్వయం రచనకు తాత్త్వికమయిన శోభను చేకూరుస్తూంది. ఇందులో విధి ప్రేరితం ప్రతీయమానవుతూంది.

పొడుచు కొని వచ్చు బాణము పోల్కి గాగ
ముక్కు దీపింప మిక్కిలి ఎక్కు వెట్టు
శార్ఙ్గమో పినాకమో నాగ చాచి నట్టి
రెక్క దోయిగ మింట చరింప బోవె"

హంసను పొడుచుకొని వచ్చు ముక్కుతో ఎక్కుపెట్టిన బాణంవలె చాచిన రెక్కలతో శార్ఙ్గమో పినాకమో వలె ఆకాశంలో వెళ్ళమని చెబుతున్నాడు. శార్ఙ్గము విష్ణువు ఆయుధం, పినాకం శివుని ఆయుధం. శివుడూ విష్ణువూ సఖులు. రెండు దివ్య శక్తులూ కలిసిన మహాశక్తి రూపం హంసలో దర్శన రూపాన్ని పొందుతూంది.

"విప్రెసలార మోము పయి
  వేలుపు వాహిని యెర్ర ఒండు బొ
ట్టొప్పగ స్నానమున్ సలిపి
  ఒడ్డున నట్టిటు తిర్గుచున్ జరీ
కుప్పడ మంచు ధోవతిని
  కొంగులు వారగ నారబట్టు నే
గొప్ప ద్విజుండ వొక్కొ ఇట
  కుం చనుదెంచితి మత్సుంఖడవై"

ఇదొక గొప్ప పద్యం. జీవితంలో వాస్తవ చిత్రంతో రూపొందింది. గంగానదిలో స్నానం చేసి, తీరంలోని ఎర్రని ఒండుతో బొట్టు పెట్టుకొని, ఒడ్డునే జరీ అంచు తెల్లని ధోవతి కొంగులు పట్టుకొని ఆరబెట్టుకునే ద్విజ సఖుని వలె హంస! కనిపించింది. జీవితంలో సన్నిహితమయిన వాస్తవ రూపంపై నిలిచిన భావ చిత్రం. తెలుగు కావ్య ప్రపంచంలో శాశ్వతంగా నిలిచేది. వశిష్ఠుడు తన దగ్గరికి వచ్చినపుడు కలిగే మధురమైన అనుభూతి కలిగింది. జ్ఞాన మూర్తి బ్రహ్మర్షి గురుదేవుని రూపం సాధనా మార్గంలో ఆధ్యాత్మికమైన దివ్య భావనను చేకూరుస్తూంది.



"ఈ జగదేక మోహన మ
హేశ్వర సుందర రూపమెంత యు
త్తేజిత భావనా పటిమ
తెచ్చెను అబ్బురమయ్యె నేత్ర నీ
రాజిత భూతమైనది ధ
రాసుత కంటికి శాంతి తేవె! ఉ
ద్వేజితమయ్యె తన్నయన
దీప్తి మృషామృగ దర్శనంబుచే"

ఈ పద్యం నిర్ద్వంద్వంగా ప్రస్తుత సందర్భంలో పరమమయిన భావనా దృష్టితో కథలో ప్రధాన పాత్ర లక్ష్యం మొదలైన కోణాల్లో గభీరమయిన భావనాలోకంతో మహనీయమయింది. ఈ హంస శ్రీరామచంద్రుని ఆత్మను పరవశింప జేసింది. తన సుందర మయిన ప్రాణి రూపంతో భావనా శక్తికి ఉత్తేజాన్ని కలిగించింది. ఇదొక మానసికమయిన విశేష స్థితికి కారణ మయిన ప్రభావ రూపం. కంటికి ఆరతి ఇచ్చినట్లుగా ఉంది. చల్లదనం పరిమళం దివ్య భావన కలిసిన అనుభూతి తేజాన్ని భావింప జేస్తుంది. ఇక సీతాదేవి విషయంలో సందేశంలో ఆమె కళ్ళు మాయలేడిని చూచి ఆకర్షింపబడీ భ్రమకు లోనయింది. దృష్టి దీప్తి చెదరింది. మాసినట్లయింది. కారణం ఆమె ఆ మాయా ప్రభావానికి లోనయింది. ఆపై (జరిగిన పరిణామాల్ని బట్టి) భీతితో స్తిమితత్వం తప్పీ, దుఃఖంలో కాంతి తరిగీ ఉన్న ఆమె కళ్ళకు శాంతి నీరాజనం ప్రసాదించవలసిందిగా వినతి. ఈ పద్యం ఆలోచన చేసిన కొద్దీ ఉదాత్త మయిన భావనలో సమాలోచనాన్ని నడిపిస్తుంది. ఈ జగదేక మోహన మహేశ్వర రూపమన్న ఎత్తుగడలో పద్యశిల్పం అట్లా ఉంచి హంస యొక్క నిజ రూపం దాని ప్రభావ శక్తిలో ఆత్మపారమ్యత స్ఫూర్తికి వస్తుంది.

1) ఉజ్వలమయిన భావనా బలాన్ని చేకూరుస్తూంది.
2) కంటికి నీరాజన మిచ్చినట్లున్న హ్లాదమయమైన శాంత స్థితినీ కలిగిస్తూంది.
3) ఈ విధంగానే సీతాదేవి కంటికి ఇంపుగా ఎదకు శాంతి కరంగా ఉండాలనీ.

ఇందులో తాను పొందిన దివ్యమైన అనుభూతిని దూరంగా శోక స్థితిలో ఉన్న సీత మనస్సు కూడా పొందాలనే అభిలాష హంస దర్శనం లోని సత్ప్ర యోజనాన్ని

తెలుపుతూంది. సీత నయన కాంతి కపట లేడి కనిపించి మాయ క్రమ్మడం వల్ల మాసింది. చలించింది. దృష్టి చెదరింది. భయపడింది. 'ఉద్వేజిత'మన్న మాటలో ఆమె పొందిన మానసికమైన కలతనూ వ్యథనూ కూడా సూచిస్తూంది.

ఇప్పుడామెకీ హంస దర్శనమెంతో అవసరమయింది. సీతకు తాను వశీకృతుడు కావడం ఆమె "బ్రహ్మవిత్" శీలము చేతనే అన్న మాట రాముని ఆంతర్యాన్ని ప్రకటిస్తూంది. బ్రహ్మవేత్తయై కర్మమార్గానువర్తియైన జనకుని కూతురుగానే కాక బ్రహ్మమును గురించి తెలిసిన లక్షణం కలిగిందిగా శ్రీరాముని మన్ననకు పాత్రమైంది. ఇది కథలో ఎన్నో ప్రశ్నలకు సమాధానాల్ని అందించే భావపేటిలా ఉంది.

## IV

రావణుడు సంధ్యాజపం తరువాత సౌధాగ్రం పై కూర్చున్న సమయంలో హంసను చూచాడు. మనసులో ఏదో భావన మెరసింది. ఔను కాదు అన్న విచికిత్సకు లోనయ్యాడు. నిర్ణయానికి రాలేక పోయాడు. సేవకుల్ని "ఆ హంస ఎక్కడి నుంచి వచ్చింద"ని అడిగాడు. వారు అది వచ్చిన దిశను చూపించారు. వారు చూపిన దిశలో శ్రీరామ చంద్రుడు సేనా సమేతుడై నిలిచి ఉన్నాడు. వెంటనే దేవాగారానికి వెళ్ళాడు. ఏదో శూన్యంతోచింది. మనస్సు ఆందోళన చెందింది. సీతను చూచేందుకు బయలు దేరాడు. మాయా కల్పితమయిన రామ లక్ష్మణుల శిర శర శరాసనాల్ని సీత ముందు ఉంచడం జరిగింది. రావణుడు వారి వధ గురించి సీతకు చెప్పాడు. ఆమె కలత చెందింది. దుఃఖించింది. తన కళ్ళకు మాయ క్రమ్మినట్లనిపించింది. మూర్ఛపోయింది కొంత సేపటికి తేరుకుంది. వృక్షాగ్రం పై బంధువులు నిలిచినట్లనిపించింది. "రెక్కలార్చికొని" "హంసాధ్యక్షుడే తెంచి" కూర్చోవడం జరిగింది. సీత చూచింది. పూర్వం హనుమ కూర్చున్న చోటనే హంస కనిపించింది. ఆమె గుండెలో "అమృత కుల్య" ఉబ్బినట్లనిపించింది. ఆనందం వేసింది. ఆమె చిత్తం మధు బిందువులతో విప్పారింది. ఇంతలో నియతమైన వేళ దాటి మాయా కల్పిత శిర శర శరసానాలు అదృశ్యమయినాయి.

హంస దర్శనంతో సీతలో గాఢమయిన సమాధి ఏర్పడింది. అపుడామె "ఈశ్వరేశ్వరి" "సనాతని" యని తోచింది. ఆమె క్రీ పెదవిపై "చిరునవ్వు" అంకురించింది. అది "అతిలోక మోహనం"గా ఉంది. అది నవ్వులా లేదు. అలౌకిక మయిన దివ్య భావాన్ని స్ఫురింపజేస్తూంది. ఆ "చిరు నవ్వు"ను చూచిన రావణుని "దృక్‌రోచులు" మందగించాయి. కాంతి చెడి వెల వెల పోయాయి. ఆ స్థితిలో కోపం



వచ్చింది. ఇంతకూ కారణం "హంస"గా తోచింది. దుఃఖం వేసింది. లోపల భక్తితో శివుని ఉద్దేశించి తన భక్తి మహనీయతను వెల్లడిస్తాడు. సీతా పతి ఇప్పటివరకూ "బహిశ్శత్రువు", ఇందాకా వచ్చాక ఇప్పటి నుండి "అంతశ్శత్రుత"కు స్థానమయిన వాడుగా కనిపించాడు. ఇది హంస ప్రవేశంతో పొందిన రావణుని పాత్ర స్వరూపం. కథా నిర్మాణ ప్రణాళికలో ప్రత్యేకతను పొందింది.

ఆ రాత్రి అతనికి సరిగా నిద్రపట్టలేదు. ఉదయం లేచి స్నానం చేసి శివపూజ చేసాడు. అక్షయ కుమారుని భార్య వచ్చింది. అతడు నెలరోజుల క్రితం హనుమంతుని చేతిలో హతమయినాడు. ఐదేండ్ల కొడుకుని తీసుకొని తల్లి వచ్చింది. వాని చేతిలో ఉన్న రాజత హంసను మామగారికిప్పించింది. నిన్న పిల్లవాడు "ముచ్చట పడి పూజా గృహంలోకి వెళ్ళి తెచ్చాడ"నీ "తిరిగి ఇమ్మంటే తెచ్చాడ"నీ చెప్పింది. మనుమని చూడగానే అక్షయ కుమారుడు గుర్తుకు వచ్చాడు! మనస్సు ఆర్ద్రమయింది. ఆలోచన మారింది. తన ప్రాణాలు లేచి వచ్చాయి. ముద్దు మనుమణ్ణి చంక నెత్తుకున్నాడు. ముద్దులు పెట్టుకున్నాడు. చెప్పరాని పరవశతను పొందాడు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇదొక అద్భుతమయిన రచనాకృతిని పొందింది.

"తన ప్రాణంబులు లేచి వచ్చినవి దై
త్యస్వామికిన్ ముద్దు మ
న్మని వే చంకను గొంచు చుంబన విధా
మత్తుండు తా హంస ని
చ్చెను క్రీడామయమైన వస్తువుగ నా
చిన్నారి పొన్నారికిన్
మనుమండున్ తన తాత ముద్దిడు కొనెన్
మత్తానదార్ద్రాక్షుడై"

ఆ హంసను ముద్దు మనుమనికి ఆట వస్తువుగా ఇచ్చాడు.

ఈ సన్నివేశంలో ఆర్ద్ర భావంతో కథ పొందిన మలుపు కథన శిల్పాన్ని కలిగింది. శివుని అహంకార సౌందర్య శిఖా రూపంగా, విధి సూచకంగా శాంతి భావనతో పాటు మరచిన ఆత్మ రూపంగా, హంస దర్శనమయింది. కొస మెరుపుగా శత్రుతా వ్యక్తిత్వంతో దీపించే రావణునిలో వాత్సల్య పూర్ణమయిన మనోరూపం ఏర్పడింది. ఇది కల్పవృక్షంలో స్వతంత్రమయిన కల్పనా రూపం. కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి ఉపజ్ఞా సహితమయిన నిర్మాణంతో ఉదాత్తమయిన సృజన చేతనకు ప్రాతినిధ్యం వహిస్తూంది.

h h h

**Comparative Literary Criticism (Telugu)**
**SRUJANA CHETANA**
**RAMAYANA KALPAVRIKSHAM**
by
**Prof. Madiraju Ranga Rao**

# మాదిరాజు రంగారావు కృతులు

**A. పరిశోధన – సమాలోచనం**

1. కవిత్రయం సృజనకళ – నిర్వహణ శిల్పం
2. స్వేచ్ఛా కవిత్వం
3. నవల స్వరూపం
4. పరిశోధనా స్వరూపం
5. అధికార భాష
6. అనువాద కళ
7. దాశరథి కవితా సమాలోచనం
8. సమ దర్శనం
9. ఆలోకనం (సాహిత్య వ్యాసాలు)
10. సృజన దృష్టి–మానవీయ భావన
11. సాహిత్య వ్యాసాలు
12. మహాప్రస్థానం – సమాలోచనం
13. Facets of T. Free-verse
14. సృజన చేతన – రామాయణ కల్పవృక్షం

**B. సృజన – స్వేచ్ఛా కవిత్వం**

15. మానవీయం
16. పడగెత్తిన ఉదయం
17. ముక్తధాత్రి
18. ఇది వియత్నాం
19. యుగ సంకేతం
20. ఆవాహన
21. ముక్తకాలు
22. నాలో ప్రవహిస్తోంది నది
23. నాకు జ్ఞాపకముంది
24. కిర్మీరం
25. మనో భూమికలు
26. వెలుగులో ఈ నేలపై
27. మేల్కొన్న ఈ సమయం
28. శబ్దమయి ప్రాణమై
29. అగ్నిమయం జీవితం
30. కాలాన్ని నిలిపి క్షణం
31. ఈ తరం స్వరచిత్రం
32. అశాంతి ఆర్కెస్ట్రా
33. వర్తమానం స్క్రీన్‌పై
34. అగ్ని నుండి ఆనందానికి
35. జైలు కార్నర్ నుండి
36. ప్రయాణంనుండి ప్రయాణం
37. డైరి దర్పణంలో
38. ఈ శతాబ్ది రెక్కలపై
39. శాంతి స్వప్నం
40. క్రాస్ ఫైర్
41. సీజ్ ఫైర్
42. నేడు రేపు మధ్య
43. కిరణ పథం
44. స్వేచ్ఛకు సిగ్నల్
45. అభిషేకం
46. ఆగమనం
47. ఎప్పటికీ కొత్తే
48. సృజన దర్శనం
49. మరో వైపు
50. హృదయ మేఘం
51. సమకాలీనం
52. అభినవ యానం
53. ఆత్మ బంధం
54. సృజన మేఘం
55. ఉగ్ర చరణం
56. నవారంభం
57. నవ దర్శనం
58. గిఫ్ట్ ప్యాకెట్
59. పునర్దర్శనం (అస్మిత)
60. నడిచే వెలుగు చుట్టూ (I.P.)